Follow: @ANNTELUGU
15-10-2026
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 253 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## స్థానిక సమరానికి మోగిన నగారా

- ఏపీలో మూడు దశల్లో ఎన్నికలు
- అక్టోబరు 28న మున్సిపల్ , కార్పోరేషన్ల ఎన్నికలు
- తేలిన పొత్తులు.. జనసేనలోకి వంగవీటి రాధా
- పవన్ సమక్షంలో చేరిక.. మారుతున్న రాజకీయాలు

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి ముహూర్తం ఖరారైంది. రాష్ట్రవ్యాప్తంగా నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతో పాటు గ్రామీణ స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. విజయవాడలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా ఈ ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఎషెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) తక్షణమే అమల్లోకి వస్తుందని ఎస్ఈసీ స్పష్టం చేశారు. మిగతా 2వ పేజీలో

**టాప్ న్యూస్**



### 2లక్షల మందితో హైదరాబాద్‌లో భారీమార్చ్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే
- చిట్ చాట్ లో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

02



### జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం

- రోజువారీ విచారణకు సీబీఐ కోర్టు నిర్ణయం
- ఈడీ లాయర్లకు కోర్టు ఆదేశం

02



### విద్యార్థులపై క్రూరంగా వ్యవహరిస్తారా?

- రాహుల్ గాంధీ ఫైర్
- కానిస్టేబుల్ నుండి అమిత్ షా వరకు అందరినీ చట్టం ముందు నిలబెడతాం

03




## పెట్టుబడులకు తెలంగాణ భరోసా



### పారిశ్రామిక వేత్తలకు సీఎం రేవంత్ రెడ్డి హామీ

- మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలన్నది మా లక్ష్యం
- హైటెక్స్‌లో జరిగిన సమాఖ్య సదస్సులో ప్రసంగించిన సీఎం

**హైదరాబాద్, మహా :** పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తెలంగాణ ఓ భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రైజింగ్ పాలసీతో అనుకూలమైన విధానాలను అనుసరిస్తున్నామని తెలిపారు. హైటెక్స్‌లో జరిగిన సమాఖ్య సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. జనాభా శాతాన్ని మించి తెలంగాణ రాష్ట్రం జీడీపీకి తన వాటా అందిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదని మంచి పాలసీతో ఎవరు వచ్చినా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ఏ దేశ ఆర్థిక మిగతా 2వ పేజీలో

### విద్యుత్ అంతరాయాలపై సీఎం రేవంత్ ఆగ్రహం

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీని సస్పెండ్ చేస్తాం
- సరఫరా సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం

02



అపార్ట్మెంట్స్ కింద యదేచ్ఛగా షెటర్ల నిర్మాణం



## వీవీకే స్క్వేర్, శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ అరాచకం...!

### ఓల్డ్ సఫిల్‌గూడ ప్రధాన రహదారి పక్కనే నిబంధనలకు తూట్లు..!

- రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లలో ధర్జాగా కమర్షియల్ దందా...!
- ఓసీ పొందిన తర్వాత 11 అక్రమ షెటర్ల నిర్మాణం...!
- నివాస సముదాయాన్ని వాణిజ్య కేంద్రంగా మార్చి యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..!
- టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్న తంతు ..!
- నోటీసులిచ్చి చేతులు దులుపుకున్న వైనం...!
- రోడ్డు భద్రత, ట్రాఫిక్‌కు ముప్పుగా షెటర్లు..!
- ఫిర్యాదులు వెల్లువెత్తినా చర్యలు శూన్యం ..!
- ఎంఎంసీ కమిషనర్ స్పందించాలంటున్న స్థానికులు..!
- ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ రద్దు చేయాలని స్థానికుల డిమాండ్..!

02

ఓల్డ్ సఫిల్‌గూడ ప్రధాన రహదారి పక్కనే శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ నిర్మించిన వీవీకే స్క్వేర్ అపార్ట్‌మెంట్ నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలకు తెగబడింది. రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లలో ధర్జాగా కమర్షియల్ వ్యాపారం కోసం నివాస ప్రాంతాన్ని వాణిజ్య సముదాయంగా మార్చేసింది. బిల్డింగ్ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) పొందిన తర్వాత ఎలాంటి అనుమతులు లేకుండా 11 షెటర్లను నిర్మించడం స్థానికంగా కలకలం రేపుతోంది.ఈ అక్రమ నిర్మాణాల వల్ల ఓల్డ్ సఫిల్‌గూడ రహదారిలో భవిష్యత్తులో రోడ్డు భద్రత కొరవడి, ట్రాఫిక్ సమస్య తీవ్రతరమవుతోందిని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే ఈ తంతు సాగుతోందని, భారీగా ముడుపులు ముట్టడంతోనే కేవలం నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. అక్రమాలకు తావులేకుండా ఎంఎంసీ కమిషనర్ స్వయంగా కలగజేసుకొని, సదరు భవనం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



## రామచందర్ రావు వైపే మొగ్గు

### ఆయనకే గెలుపు ఛాన్స్ ఉందంటున్న బీజేపీ సర్వేలు

- హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం అభ్యర్థిత్వంపై దాదాపునిర్ణయం
- రేసులో ఎన్ వీ సుభాష్.. పవన్ కుమార్ రెడ్డి
- కమలంలో సీటు కోసం కుస్తీలు
- రెండు సీట్లకు పెద్ద సంఖ్యలో పోటీ పడుతున్న ఆశావహులు
- అభిప్రాయ సేకరణ పూర్తి చేసిన కమిటీలు.. అధిష్ఠానానికి నివేదిక

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో జరగబోయే రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసే ప్రక్రియను భారతీయ జనతా పార్టీ ముమ్మరం చేసింది. ఈసారి టికెట్ల కోసం గతంలో ఎన్నడూ లేనంతగా ఆశావహులు పోటీ పడుతుండటంతో, ఎంపిక ప్రక్రియ ఆసక్తికరంగా మారింది. మహబూబ్‌నగర్‌రంగారెడ్డిహైదరాబాద్ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్సీ, పార్టీ సీనియర్ నేత ఎన్. రాంచందర్‌రావు పేరు బలంగా వినిపిస్తున్నప్పటికీ, పలువురు సీనియర్లు గట్టిగా లాబీయింగ్ చేస్తుండటంతో పార్టీలో ఉత్కంఠ నెలకొంది. అయితే గతంలో ఈ స్థానం నుండి ప్రాతినిధ్యం వహించిన రామచందర్ రావుకు దీనిపై పూర్తి అవగాహన ఉంది. గత ఎన్నికల్లోనూ స్వల్పతేడాతో ఓటమిపాలయ్యారు. ఇపుడు బీఆర్ఎస్ అధికారంలో లేకపోవడం, రామచందర్ రావు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండడం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధికార కాంగ్రెస్ పార్టీ మిగతా 2వ పేజీలో




### సింగరేణి ప్రైవేటీకరణకు ప్రభుత్వం కుట్ర

సింగరేణి కార్మిక గర్జనలో కేటీఆర్

03





## వీవీకే స్క్వేర్, శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్

# అరాచకం...!




**మహా, సిటీ బ్యూరో :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మల్కాజ్‌గిరి జోన్, మౌలాలి సర్కిల్, ఓల్డ్ సఫిల్‌గూడ ప్రధాన రహదారి పక్కనే వీవీకే స్క్వేర్, శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ పేర్లతో రెసిడెన్సియల్ అపార్ట్‌మెంట్లలో దర్జాగా కమర్షియల్ సముదాయాలు నిర్మించి అధికార యంత్రాంగానికే సవాల్ విసిరారు. అక్రమంగా కొనసాగుతున్న కమర్షియల్ షెటర్ల నిర్మాణాలను అడ్డుకోవడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నివాస సముదాయాల పేరుతో అనుమతులు పొంది, నిర్మాణాలు పూర్తయ్యాక, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ)పొందిన అనంతరం నిబంధనలకు తూట్లు పొడుస్తూ అపార్ట్మెంట్స్ కింది భాగంలో 11 కమర్షియల్ షెటర్లను ఏర్పాటు చేస్తున్నారంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలు ఫిర్యాదులు, వార్త కథనాలు వెలువడినా సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో స్పందించి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**'మామూళ్ల' మత్తులో టౌన్ ప్లానింగ్ అధికారులు**

ప్రధాన రహదారి పక్కనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు ముట్టాయని స్థానికులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం 'ఓసీ' వచ్చిన తర్వాత భవన నిర్మాణంలో ఎలాంటి మార్పులు చేయకూడదన్న కనీస నిబంధనలను సైతం అధికారులు బిల్డర్ వద్ద తాకట్టు పెట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్థానికుల నుంచి ఒత్తిడి రావడంతో, కేవలం కంటి తుడుపు చర్యగా 'నామ్‌కే వాస్తే' నోటీసులిచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారే తప్ప.. సదరు అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల 'నోటీసుల డ్రామా' వెనుక భవన నిర్వాహకులతో ఉన్న లాలూచీ స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి...**

ఏదయినా నివాస సముదాయం (రెసిడెన్సియల్) నుండి వాణిజ్య సముదాయం (కమర్షియల్ )గా మార్చాలంటే మున్సిపల్ నిబంధనల ప్రకారం భారీగా ఫీజులు, ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. లాండ్ యూజ్ చేంజ్, కన్వర్షన్ చార్జెస్, ఇంపాక్ట్ ఫీజు, కమర్షియల్ అసెస్‌మెంట్ టాక్స్, భవన ప్లాన్ అనుమతి రుసుములతో పాటు కమర్షియల్ పార్కింగ్ లేఅవుట్ ఛార్జీల రూపంలో ప్రభుత్వ ఖజానాకు లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతుంది.

అయితే, 'వీవీకే స్క్వేర్' బిల్డర్ తొలుత తక్కువ ఫీజులతో నివాస అనుమతులు పొంది, ఆ తర్వాత అక్రమంగా 11 కమర్షియల్ షెటర్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య అనుమతుల కోసం చెల్లించాల్సిన ఫీజులు, పన్నులను ఎగ్గొట్టి సదరు బిల్డర్లు లబ్ధి పొందుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల ఉదాసీనత, నిఘా లోపం కారణంగా కేవలం స్థానిక సర్కిల్ ఆదాయానికే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకి కూడా గండి పడుతోందని, తక్షణమే అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**ట్రాఫిక్‌కు సమస్యకు ముప్పుగా షెటర్లు..**

ప్రధాన రహదారి పక్కనే వాణిజ్య సముదాయాల కోసం ఈ షెటర్లు నిర్మిస్తుండటంతో భవిష్యత్తులో కాకుండా ప్రస్తుతం కూడ పార్కింగ్, వాహనాల రాకపోకలు, పాదచారుల భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారికి ఆనుకుని వాణిజ్య కార్యకలాపాలు పెరిగితే ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని రోడ్డు ప్రమాదాలు కూడా జరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నా నిఘా విభాగాలు ఎందుకు మౌనంగా ఉన్నాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


మహా
బిల్డర్ల బరితెగింపు..!
రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లలో కమర్షియల్ దందా..!
వరుసగా 11 అక్రమ షెటర్ల నిర్మాణం...!
- ఓసీ పొందిన తర్వాత నిర్మాణాలకు శ్రీకారం..!
- టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే..!
- వీవీకే స్క్వేర్, శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ పేర్లతో యదేచ్ఛగా నిర్మాణాలు..!
- రోడ్డు భద్రత, ట్రాఫిక్‌కు ముప్పుగా షెటర్లు..!
- ఫిర్యాదులు వెల్లువెత్తినా చర్యలు శూన్యం..!


మహా
బిల్డర్ల బరితెగింపు..!

**ఎంఎంసీ కమిషనర్ స్పందించాలి..**

ఓల్డ్ సఫిల్‌గూడలోని 'వీవీకే స్క్వేర్' శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ పేర్లతో కొనసాగుతున్న అక్రమ షెటర్ల నిర్మాణాలపై మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నివాస అనుమతులు పొంది, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) వచ్చిన అనంతరం 11 కమర్షియల్ షెటర్లు నిర్మించినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని వారు కోరుతున్నారు. పార్కింగ్ స్థలాలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన 'వీవీకే స్క్వేర్' భవనానికి ఇచ్చిన ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసి )ను తక్షణమే రద్దు చేయాలని, అక్రమంగా నిర్మించిన 11 షెటర్లను వెంటనే కూల్చివేసి, సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## స్థానిక సమరానికి

# మోగిన నగారా

(మొదటి పేజీ తరువాయి )

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థలకు (అర్బన్ లోకల్ బాడీస్) అక్టోబర్ 28వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ జాబితాలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల నుంచి అక్టోబర్ 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. అక్టోబర్ 19న అందిన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) కార్యక్రమం ఉంటుంది. పోటీ నుంచి వైదొలగాలనుకునే అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 21వ తేదీ వరకు తుది గడువును నిర్ణయించారు. అనంతరం అక్టోబర్ 28న రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసి, 30వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి తుది ఫలితాలను అధికారికంగా ప్రకటిస్తారు. ఈ ఎన్నికలు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ప్రధాన రాజకీయ పార్టీల బలాబలాలను తేల్చనున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. విజయవాడ మేయర్ అభ్యర్థిగా జనసేన తరుపున వంగవీటి రాధ బరిలో నిలవనున్నారు. పవన్ కల్యాణ్ సమక్షంలో ఆయన కండువా కప్పుకున్నారు.

**పరిషత్ లకు నవంబర్ 3న ఎన్నికలు**

పట్టణ స్థానిక సంస్థలతో పాటే గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన కీలక ఎన్నికలకు కూడా ఎస్ఈసీ షెడ్యూల్ ఖరారు చేసింది. మండల పరిషత్, జిల్లా పరిషత్ (ఎంపీటీసీ, జడ్పీటీసీ) ప్రాదేశిక నియోజకవర్గాలకు నవంబర్ 3న పోలింగ్ నిర్వహించి, నవంబర్ 5న ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రే జడ్పీ చైర్మన్ల రిజర్వేషన్లను సైతం గెజిట్ ద్వారా ఖరారు చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో సైతం రాజకీయ సందడి మొదలైంది. ఇక గ్రామ పంచాయతీ ఎన్నికలను మొత్తం మూడు దశల్లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా నవంబర్ 26న తొలిదశ పంచాయతీ ఎన్నికలు, నవంబర్ 29న రెండో దశ పోలింగ్, డిసెంబర్ 2న మూడో దశ ఎన్నికలు జరగనున్నట్లు ఎస్ఈసీ తన షెడ్యూల్‌లో స్పష్టం చేసింది. ఈ భారీ ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా ముగించేందుకు వీలుగా పూర్తి స్థాయి పోలీస్ బందోబస్తు, పటిష్టమైన భద్రతా చర్యలు, మద్యం విక్రయాల నియంత్రణ తదితర అంశాలపై ఎన్నికల సంఘం ఇప్పటికే జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు అత్యంత కఠిన ఆదేశాలు జారీ చేసింది.

# పెట్టుబడులకు తెలంగాణ భరోసా






( మొదటి పేజీ తరువాయి )

వ్యవస్థ బలపడ్డా అందులో మహిళల భాగస్వామ్యం ఉన్న దేశమే అత్యధికంగా ఆర్థికంగా ఎదిగిన దేశమని రేవంత్ రెడ్డి తెలిపారు. అందుకే రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు.పెట్టుబడులు పెట్టే యువ పారిశ్రామికవేత్తలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆహ్వానం పలుకుతుందన్నారు. కొత్త పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి, రాయితీలు, ప్రోత్సాహకాలతో సమగ్ర విధానం రూపొందించిందన్నారు. తెలంగాణను మూడు ఎకనామిక్ జోన్లుగా అర్బన్, పెరిఅర్బన్, రూరల్ విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. సర్వీస్, తయారీ, వ్యవసాయ రంగాలకు సమప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వ ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ జనాభాలో రాష్ట్ర వాటా 2.5 శాతమే అయినా జీడీపీలో 5 శాతం తెలంగాణ నుంచే అందిస్తున్నామని చెప్పారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పెట్టుబడులు, కచ్చితమైన ప్రణాళికలు, పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతోనే ఈ లక్ష్యాల సాధన సాధ్యమని సీఎం పేర్కొన్నారు. వ్యక్తులుగా కంటే అందరూ ఒక కమ్యూనిటీగా ఏకమైతేనే యువతకు మరింత బలమని అభిప్రాయపడ్డారు.

**ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి**

మహిళల భాగస్వామ్యం ఉన్నప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళా సాధికారత, ఉపాధి కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే కాకుండా ఆ సంస్థకు 1,000 బస్సులను అద్దెకు ఇచ్చే యజమానులుగా మహిళా సంఘాలు ఎదిగాయన్నారు. కార్పొరేట్ దిగ్గజాలకు ధీటుగా మహిళా సంఘాల ద్వారా 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి, జెన్‌కోకు సరఫరా చేస్తున్నారన్నారు. ప్రతి జిల్లాలోనూ మహిళా సంఘాలకు భూములు కేటాయించి, పెట్రోల్ బంకుల నిర్వహణ బాధ్యతలు అప్పగించామన్నారు.

**ప్రభుత్వం పరంగా పూర్తి సహకారం**

శిల్పారామం వద్ద 3.5 ఎకరాల్లో ఇందిరా మహిళా శక్తి బజార్ల ఏర్పాటు అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్‌కు వేదిక అని రేవంత్ రెడ్డి తెలిపారు. యువతతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలను కూడా సమాఖ్య ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వపరంగా పూర్తి మద్దతిస్తామని ఆయన పేర్కొన్నారు. పారిశ్రామిక అభివృద్ధిలో రాజకీయాలకు తావులేదన్నారు. గత 30 ఏళ్లుగా ఉన్న మంచి విధానాలను తమ ప్రభుత్వం మార్చలేదని గుర్తుచేశారు. 'తెలంగాణలో మీ పెట్టుబడులకు పూర్తి భద్రత, లాభం, సత్వర అనుమతులు ఉంటాయి రండి మాతో కలిసి ఎదగండి' అని పారిశ్రామిక వేత్తలకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# రామచందర్ రావు వైపే మొగ్గు

( మొదటి పేజీ తరువాయి )



పట్టభద్రుల ఓటింగ్ లో బలంగా లేదన్న అంచనాలతో రామచందర్ రావుకు అన్ని రకాలుగా అనుకూల వాతావరణం ఉందని బీజేపీ హైకమాండ్ తాజాగా చేయించిన సర్వేల్లో తేలినట్లు చెబుతున్నారు.

**అభ్యర్థిత్వాలకు తీవ్ర పోటీ**

ఈ రెండు స్థానాలకు సంబంధించి ఆశావహుల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు బీజేపీ రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. మంగళవారం ఈ కమిటీలు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల నుంచి అభిప్రాయాలను స్వీకరించాయి. ఈ నివేదికలను బుధవారం పార్టీకి అందజేశాయి. మహబూబ్‌నగర్‌రంగారెడ్డిహైదరాబాద్ పట్టభద్రుల స్థానానికి సుమారు 13 మంది, నల్గొండఖమ్మంవరంగల్ స్థానానికి ఏడుగురు నేతలు పోటీలో ఉన్నారు. హైదరాబాద్ స్థానానికి రాంచందర్‌రావుతో పాటు పార్టీ అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్, డోకూరి పవన్‌కుమార్, గౌతమ్ రావు, శ్రీవర్ధన్ రెడ్డి వంటి నేతలు టికెట్ ఆశిస్తున్నారు. అయితే, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తన అనుచరుడైన పవన్‌కుమార్‌కు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నట్లు సమాచారం. ఎన్ వి సుభాష్ ఇప్పటికే ప్రచారం, ఎన్ రోల్ మెంట్ అంశాల్లో దూకుడుగా ఉన్నారు. మరోవైపు నల్గొండఖమ్మంవరంగల్ స్థానాన్ని బీసీ అభ్యర్థికి కేటాయించాలనే యోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ స్థానం కోసం పీఆర్‌టీయూ నేత భిక్షంగౌడ్, పుల్లారావు యాదవ్, డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, కాసం వెంకటేశ్వర్లు తదితరులు పోటీ పడుతున్నారు. రాష్ట్ర నాయకత్వం కమిటీల నివేదికలను పరిశీలించి ప్రతి స్థానానికి ముగ్గురి పేర్లతో ఒక జాబితాను సిద్ధం చేసి జాతీయ నాయకత్వానికి పంపనుంది. దసరా పండుగ తర్వాత తుది అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. పార్టీ వ్యూహం ప్రకారం, ఒక స్థానాన్ని ఓపెన్ కేటగిరీకి, మరొకటి బీసీ వర్గానికి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు మార్చి 2027లో ఎన్నికలు జరగనున్నాయి.

# 2లక్షల మందితో హైదరాబాద్‌లో భారీమార్చ్



హైదరాబాద్, మహా : ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియకు వ్యతిరేకంగా, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దసరా తర్వాత హైదరాబాద్‌లో రెండు లక్షల మందితో భారీ మార్చ్, బహిరంగ సభను నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. దక్షిణాదిలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న రెండు రాష్ట్రాల్లో ఇలాంటి భారీ సభలు నిర్వహించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించిందని ఆయన వెల్లడించారు. బుధవారం నాంపల్లిలోని గాంధీభవన్‌లో విలేకరులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన తప్పిదాలన్నీ ఆధారాలతో సహా ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, 2029లో ఎవరు ఓడిపోతారో ప్రజలే చెబుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మహిళా జర్నలిస్టులను అవమానించారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు చౌకబారు ఆరోపణలు చేయడం శోచనీయమని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాహుల్ గాంధీ షూ లేస్ కట్టిన నిరాడంబరతను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. వాజ్ పేయి, సుష్మాస్వరాజ్ లాంటి నేతలు లేకపోతే బీజేపీ అసలు మొలకెత్తేదా అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కేంద్రంలోని మోదీ సర్కారు కాలరాస్తోందని ధ్వజమెత్తారు. మతతత్వ బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ మద్దతు ఉంటుందని, అందులో భాగంగానే సీజేపీ, ఇండియా కూటమి ఎవరికి వారుగా పోరాడుతున్నారని స్పష్టం చేశారు. అయోధ్య రామమందిరానికి తొలిసారిగా భూమిపూజ చేసింది మాజీ ప్రధాని రాజీవ్ గాంధీయేనని గుర్తుచేసిన ఆయన, దేవుడికి రాజకీయాలకు ముడిపెడుతూ బీజేపీ మతాల మధ్య చిచ్చు పెడుతోందని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశం ప్రమాదంలో పడిందని, వారి పాలనలో సామాన్యులకు ఒరిగిందేమీ లేదని, కేవలం బడాబాబులకు మాత్రమే లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అఖండ మెజార్టీతో అధికారంలోకి రావడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**దసరాకు పదవులు**

గత పదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రతి చిన్న అంశాన్ని రాజకీయం చేసి, సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి కాలయాపన చేశారని టీపీసీసీ చీఫ్ విమర్శించారు. ఎల్ నినో అనేది కేవలం ప్రకృతి పరమైన ప్రభావమని పేర్కొన్నారు. ఎర్రవల్లిలో ఉన్న 45 ఎకరాల భూమి ఎవరి కబ్జాలో ఉందో విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తన కుటుంబం గురించే ఎక్కువ వాస్తవాలు చెబుతున్నారని, ఆమె మాటల్లోని ఆంతర్యం ప్రజలందరికీ అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతల ఫామ్‌హౌస్‌లపై దాడులు చేయడం తమ ఉద్దేశం కాదని, నీతిమంతులమని గొప్పలు చెప్పుకుంటున్న వారి బండారాన్ని, అసలు విషయాలను ప్రజలకు తెలియజేయడానికే తాము ఫామ్‌హౌస్‌లను సందర్శిస్తున్నామని వివరించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ తలపెట్టిన సింగరేణి గర్జనకు ఎలాంటి అర్థం లేదని, సింగరేణి కార్మికులకు అసలైన ఫలాలను కాంగ్రెస్ ప్రభుత్వమే అందిస్తోందని స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల విజయంపైనా సీరియస్‌గా దృష్టి సారించామని, ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నామని వెల్లడించారు. ఈ భేటీకి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని తెలిపారు. ఇక పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే కార్పొరేషన్ పదవుల భర్తీలో కొంత జాప్యం జరుగుతోందని, దసరా నాటికి నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన కుండబద్దలు కొట్టారు. 24 లేదా 25న ఇండికూటమి మార్చ్ ఉండే అవకాశం ఉందన్నారు.

## జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం

**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో రోజువారీ విచారణకు సీబీఐ కోర్టు నిర్ణయించింది. సీబీఐ కేసులతోపాటు ఈడీ కేసులనూ రోజువారీగా విచారించాలని స్పష్టం చేసింది. రోజువారీ విచారణకు హాజరుకావాలని ఈడీ లాయర్లకు సైతం సూచించింది. సీబీఐ కోర్టులో పదేళ్లుగా 9 ఈడీ ఛార్జిషీట్లు పెండింగ్ లో ఉన్నాయని, వాటితో పాటు డిశ్చార్జి పిటిషన్లు సైతం తేలకపోవడంతో ఈడీ కేసుల విచారణ ముందుకు సాగడం లేదు. ఈ పరిణామాలతో ఈడీ కేసులను రోజువారీగా విచారించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటివరకు ప్రధానంగా సీబీఐ కేసులనే కోర్టు విచారిస్తూ వస్తోంది. దీంతో తమ కేసులను కూడా విచారించాలని, కేసు త్వరగా తేలేలా సీబీఐ కోర్టును ఆదేశించాలని కోరుతూ ఈడీ పిటిషన్ వేసింది. ఈ క్రమంలో స్పందించిన సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే సోమవారం నుంచి ఈడీ కేసులను సీబీఐ కోర్టు వరుసగా రోజువారీ ప్రాతిపదికన విచారించే అవకాశం కనిపిస్తోంది.





# విద్యుత్ అంతరాయాలపై సీఎం రేవంత్ ఆగ్రహం

**హైదరాబాద్, మహా :** విద్యుత్ అంతరాయాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితుల్లో మార్పు రావడం లేదన్న సీఎం ప్రమాదం ఉన్నా ఉత్పత్తి పెంచడం లేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, కరవు పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. జిల్లాలవారీగా వర్షాభావ పరిస్థితులను సీఎంకు అధికారులు వివరించారు.

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తాం**

నైనీ, మహానది నుంచి బొగ్గు లింకేజీలు ఏర్పాటు చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. బొగ్గు లింకేజీలు ఉన్నా విద్యుత్ ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ అంతరాయాలకు వెంటనే కారణాలు తెలపాలని అధికారులను సీఎం ఆదేశించారు. విద్యుత్, తాగునీటి సమస్యలు తీవ్రం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్న రేవంత్ రెడ్డి తాగునీటి సరఫరా సజావుగా సాగేలా ప్రణాళికలు రూపొందించాలని అదికారులను ఆదేశాలు జారీ చేశారు. క్యూర్ పరిధిలో నిర్మాణ రంగానికి ఎస్టీపీలు శుద్ధి చేసిన నీరు వాడాలని అధికారులను సీఎం ఆదేశించారు. పశుగ్రాసానికి ఇబ్బందులు రాకుండా చూడాలని, ఎల్‌నినో విపత్తుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మండలంలో గ్రూప్ 1, 2 అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలని, మండలాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సీఎస్‌కు అందించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.



# రీసర్వే పై ప్రజలు అపోహలు వీడి సహకరించండి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**పర్వతగిరి, మహా** : పర్వతగిరి మండలం గోపన పల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన భూముల రీసర్వే అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని, రీసర్వేపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల రీసర్వే ప్రక్రియ ద్వారా భూముల సరిహద్దులు, విస్తీర్ణం, భూ రికార్డుల కోసం వివరాల్లో స్పష్టత, పారదర్శకత పెరుగుతాయని తెలిపారు. రీసర్వేపై ఎలాంటి అపోహలకు గురికాకుండా రైతులు, భూ యజమానులు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, రికార్డుల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసరావు, వరంగల్ ఆర్డీవో సుమ, పర్వతగిరి తహసిల్దార్ వెంకటస్వామి, గోపనపల్లి సర్పంచ్ నాంపల్లి విజయ, అనంతరం సర్పంచ్ తోట శ్రీలత, సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వరంగల్ కలెక్టరేట్ లో బతుకమ్మ సందడి

- వేడుకల్లో కలెక్టర్ తో ఆడి పాడిన జిల్లా యంత్రాంగం

**వరంగల్, కలెక్టరేట్ మహా :** వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో జిల్లా యంత్రాంగం మొత్తం ఆడి పాడి సందడి చేసింది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వరంగల్ కలెక్టరేట్ లో బతుకమ్మ పండుగ వాతావరణం నెలకొంది. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుకల్లో భాగంగా కలెక్టరేట్ లోని అధికారులు, ఉద్యోగులు ప్రదాయబద్ధంగా వేడుకలను జరుపుకున్నారు. కలెక్టరేట్ ఆవరణ మొత్తం గుమ్మడి, తంగేడు, బంతి పూలతో అందంగా ముస్తాబయింది. వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగులు రంగురంగుల పూలతో పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చారు. ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ తో పాటు అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు అందరూ కలిసి బతుకమ్మ చుట్టూ చేరి ఆడి పాడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ కలెక్టరేట్ దద్దరిల్లేలా సంబరాలు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో కలిసి జిల్లా యంత్రాంగం మొత్తం బతుకమ్మ ఆడటం అందరినీ ఆకట్టుకుంది. అధికారిక హోదాలను పక్కన పెట్టి అందరూ ఒకటిగా కలిసిపోయారు. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మ గౌరవానికి, ఐక్యతకు చిహ్నమని కలెక్టర్ అన్నారు. ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ అని, తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉత్తమంగా బతుకమ్మను పేర్చిన మహిళా బృందాలకు బహుమతులు ప్రధానం చేశారు. చివరగా అందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్ లో జరిగిన ఈ వేడుకలు అందరికీ పండుగ ఆనందాన్ని పంచాయి.

# మీ రక్షణ కోసమే ఈ స్పెషల్ డ్రైవ్.. ఏసీపి రాజు

- పోలీసులు శత్రువులు కాదు..!
- వాహనదారులు పోలీసులకు సహకరించాలి
- సరైన పత్రాలు లేని వాహనదారులకు హెచ్చరిక
- ఇబ్రహీంపట్నం ఏసీపి కేపీవి రాజు...



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 14 మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్ ప్లేట్ లేని, సరైన నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలపై, పట్నం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్ లో భాగంగా దాదాపు 12 వాహనాలను (బైకులు, ఆటోలు, స్కూటర్లు) పోలీసులు స్వాధీనం చేసుకున్న పోలీసులు వాహనదారులకు, ఏసిపి కెపివి రాజు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని, సరైన నెంబర్ ప్లేట్లు లేని వాహనాలను వదిలే ప్రసక్తి లేదని వాహనదారులకు హెచ్చరించారు. అనంతరం ఎసిపి మాట్లాడుతూ... నంబర్ ప్లేట్ అనేది వాహనం యొక్క గుర్తింపు. నంబర్ ప్లేట్ లేకుండా తిరగడం చట్ట ప్రకారం నేరమని, అనుకోని పరిస్థితుల్లో ప్రమాదం జరిగినా, దొంగతనం జరిగినా గుర్తించడం కష్టం అవుతుందని ఆయన అన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను ఎక్కువగా చైన్ స్నాచింగ్, దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు వాడుతున్నారని, అందుకే ఈ తనిఖీలు ముమ్మరం చేశామని తెలిపారు.

**ప్రతి రైడర్ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి...**

ఒరిజినల్ నంబర్ ప్లేట్ ఉండాలి, ఆర్ సి, ఇన్సూరెన్స్, పియుసి, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉండాలి. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. మైనర్లు వాహనాలు నడపరాదని సూచించారు.

**చట్టపరమైన చర్యలు తప్పవు...**

ఒకసారి కౌన్సిలింగ్ ఇచ్చి వదిలిన తర్వాత, మరోసారి ఇదే తప్పు చేస్తే మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం భారీ జరిమానా, కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేస్తామని హెచ్చరించారు.

**తల్లిదండ్రులకు సూచన...**

తమ పిల్లలకు నంబర్ ప్లేట్ లేని వాహనాలు, సైలెన్సర్ మార్చిన బైకులు ఇవ్వవద్దని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. "ఇది ప్రజల భద్రత కోసమే చేస్తున్నాం. పోలీసులు శత్రువులు కాదు, మీ రక్షణ కోసమే ఈ డ్రైవ్. అందరూ సహకరించాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి, ఎస్సై భాస్కర్, క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్ కలెక్టరేట్ లో బతుకమ్మ సందడి

వేడుకల్లో కలెక్టర్ తో ఆడి పాడిన జిల్లా యంత్రాంగం

వరంగల్, కలెక్టరేట్ మహా : వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో జిల్లా యంత్రాంగం మొత్తం ఆడి పాడి సందడి చేసింది. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.వరంగల్ కలెక్టరేట్ లో బతుకమ్మ పండుగ వాతావరణం నెలకొంది. తొమ్మిది రోజుల పాటు జరిగే బతుకమ్మ వేడుకల్లో భాగంగా కలెక్టరేట్ లోని అధికారులు, ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా వేడుకలను జరుపుకున్నారు. కలెక్టరేట్ ఆవరణ మొత్తం గుమ్మడి, తంగేడు, బంతి పూలతో అందంగా ముస్తాబయింది. వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు, ఉద్యోగులు రంగురంగుల పూలతో పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చారు.ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ తో పాటు అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు అందరూ కలిసి బతుకమ్మ చుట్టూ చేరి ఆడి పాడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ కలెక్టరేట్ దద్దరిల్లేలా సంబరాలు చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో కలిసి జిల్లా యంత్రాంగం మొత్తం బతుకమ్మ ఆడటం అందరినీ ఆకట్టుకుంది. అధికారిక హోదాలను పక్కన పెట్టి అందరూ ఒకటిగా కలిసిపోయారు. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మ గౌరవానికి, ఐక్యతకు చిహ్నమని కలెక్టర్ అన్నారు. ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ అని, తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉత్తమంగా బతుకమ్మను పేర్చిన మహిళా బృందాలకు బహుమతులు ప్రధానం చేశారు. చివరగా అందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టరేట్ లో జరిగిన ఈ వేడుకలు అందరికీ పండుగ ఆనందాన్ని పంచాయి.

# విద్యార్థులపై క్రూరంగా వ్యవహరిస్తారా?

- రాహుల్ గాంధీ ఫైర్
- కానిస్టేబుల్ నుండి అమిత్ షా వరకు అందరినీ చట్టం ముందు నిలబెడతాం



**ఢిల్లీ, మహా** : భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలంటూ.. మంగళవారం శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థుల పట్ల ఢిల్లీ పోలీసులు క్రూరంగా వ్యవహరించారంటూ.. రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఈ మేరకు విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన పాల్గొన్నారు. ఢిల్లీ యూనివర్శిటీలో విద్యాభ్యాసం చేస్తున్న కేరళకు చెందిన అధిరా అనే విద్యార్థిని.. పోలీసుల దాడిలో వినికిడి శక్తి కోల్పోయిందంటూ మండిపడ్డారు. ఈ అమ్మాయికి జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని రాహుల్ నిలదీశారు. గత నిరసనల్లో ఒక అబ్బాయి కళ్లు కోల్పోతే.. ఈసారి ఓ అమ్మాయి వినికిడి శక్తి కోల్పోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నిరసనల్లో దాడికి గురైన విద్యార్థులు.. తమపై జరిగిన అన్యాయాలను మీడియాకు వివరించారు. అధిరా మాట్లాడుతూ.. 'నిన్న శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న నన్ను పోలీసు వాహనంలో స్టేషన్‌కు తరలించారు. అమ్మాయిలను అరెస్ట్ చేసిన సందర్భంలో ఓ లేడీ కానిస్టేబుల్ వెంట ఉండాలి కదా.. అని ప్రశ్నించాను. దీనిపై కోప్పడ్డ పోలీసులు.. ఆపకుండా చెంపదెబ్బలు కొట్టారు. ఈ దాడిలో నా కంటికి, చెవికి తీవ్రగాయాలయ్యాయి. ఒక చెవి వినికిడి శక్తిని కోల్పోయింది' అని ఆవేదన చెందారు. మరో నిరసనకారుడు మాట్లాడుతూ.. 'నన్ను, నా సహోద్యోగిని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి.. 15 20 మంది పోలీసులు అతి దారుణంగా కొట్టారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఢిల్లీ సరిహద్దులకు మమ్మల్ని తరలిస్తున్న సమయంలో.. అంకిత్ కసానా అనే కానిస్టేబుల్ దారిపొడవునా కొడుతూనే ఉన్నాడు' అని తెలిపారు. వాంతులు వస్తున్నాయని పోలీసులను అభ్యర్థించగా.. 'బ్యాగ్‌లో వాంతి చేసుకో' అంటూ నిర్లక్ష్యంగా బదులిచ్చారని ఓ విద్యార్థి వాపోయారు. పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న సమయంలో తమను అమానుషంగా కొట్టారని, ప్రైవేట్ పార్ట్స్‌పై దాడి చేశారని ఓ విద్యార్థి తెలిపారు. ఫోన్లు, వాలెట్లను లాక్కొని.. తిరిగి ఇవ్వకుండానే తమను విడుదల చేశారని మరికొందరు ఆరోపిస్తున్నారు.

# సింగరేణి ప్రైవేటీకరణకు ప్రభుత్వం కుట్ర

కరీంనగర్, మహా : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రామగుండం సింగరేణి ప్రాంతంలో ఏర్పాటు చేసిన 'సింగరేణి కార్మిక గర్జన' సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఆయనతో పాటు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ ఉన్నారు. సింగరేణిపై తుపాకి పెట్టి.. రైతులకు నీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సాగును నాశనం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిపై నిందలు వేస్తోందన్నారు. కరెంట్ కష్టాలకు బొగ్గు లేకపోవడమే కారణమని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. పవర్ ప్లాంట్స్‌కు సింగరేణి బొగ్గు ఇవ్వడం లేదని బద్నాం చేస్తోందని ఆయన ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ప్రభుత్వం సింగరేణికి రూ.60 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని ఆయన వెల్లడించారు. అందుకే సింగరేణిని ప్రైవేటు పరం చేయడానికే ప్రభుత్వం ఇలాంటి కుట్రలు పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు.

# తెలంగాణకు వర్ష సూచన

**హైదరాబాద్, మహా :** తెలంగాణకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వర్షం హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని హెచ్చరించారు. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ దశలో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తున్నాయని.. ఈశాన్య రుతుపవనాల ప్రభావం, ఇతర వాతావరణ పరిణామాలతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా దక్షిణ, తూర్పు తెలంగాణతో పాటు మధ్య తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడవచ్చన్నారు. మేఘావృతమైన వాతావరణం కారణంగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉండగా.. వర్షాల మధ్య విరామాల్లో కొన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగవచ్చునని చెప్పారు.గురువారం ఉదయం 8.30 గంటల నుంచి అక్టోబరు 17వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి ప్రాంతాల్లోనూ అక్కడక్కడ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కూడా వర్షాలు పడవచ్చని అంచనా. అక్టోబరు 17వ తేదీ ఉదయం నుంచి 18వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు కొన్ని జిల్లాల్లో వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉంది. కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ సహా ఇతర ప్రాంతాల్లోనూ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది.

# నల్లగొండకు నీళ్లు రాకుండా అధికారుల కుట్ర!

**శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఫైర్.**

**నల్లగొండ,మహా:** నల్లగొండ జిల్లాలో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే పాలకులపై ఒత్తిడి తీసుకొచ్చి జిల్లాకు చుక్క నీరు రాకుండా చేస్తున్నారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం నల్లగొండలో మీడియాతో నిర్వహించిన చిట్ చాట్ లో ఆయన మాట్లాడుతూ సాగునీటి పంపిణీపై అధికారుల తీరును ఎండగట్టారు. నల్లగొండ జిల్లాకు నీళ్లు ఎలా ఇస్తారంటూ సాక్షాత్తూ ముఖ్యమంత్రిపైనే కొందరు అధికారులు ఒత్తిడి తీసుకురావడం విడ్డూరంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు స్వార్థపరుల మాటలు విని సీఎం కానీ, మరెవరైనా కానీ జిల్లాకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడం ఏమాత్రం సరికాదని హితవు పలికారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం కేవలం ఏడు లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని, మిగిలిన ప్రాంతాల రైతులు నీళ్ల కోసం ఆకాశం వంక చూడాల్సిన దుస్థితి నెలకొందని ఆయన గుర్తుచేశారు. నీళ్లన్నీ కేవలం పాలమూరు ప్రాజెక్టులకే కావాలని అనడం ఏమాత్రం సమంజసం కాదని గుత్తా స్పష్టం చేశారు. ఒకవైపు జిల్లా రైతాంగం అల్లాడుతుంటే, డిండి ప్రాజెక్టుకు నీళ్లు కేటాయించవద్దని అధికారులు అనడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. పాలమూరులో 25 టీఎంసీల సామర్థ్యం ఉన్న భారీ రిజర్వాయర్లను ఘనంగా ప్రారంభించారని, అయితే ఆ రిజర్వాయర్లకు అసలు ఎక్కడి నుంచి నీళ్లు తీసుకువస్తారో, వాటిని ఎలా నింపుతారో అనే కనీస ప్రణాళిక కూడా అధికారుల వద్ద లేదని ఆయన విమర్శించారు. సరైన ప్లాన్ లేకుండా ప్రాజెక్టులు కట్టి, తీరా నల్లగొండకు రావాల్సిన నీటిని అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు. పక్షపాత వైఖరి విడనాడి, అన్ని జిల్లాలకు సమన్యాయం జరిగేలా పాలకులు నిర్ణయాలు తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# బంధనలు పాటించని వైన్స్ లపై చర్యలు ఉండవా?

- ప్రజల ఇబ్బందులు పట్టవా? ముడుపులే ముఖ్యమా?
- ఇక కలెక్టర్ కే ఫిర్యాదు చేస్తాం అంటున్న ప్రజలు

**హనుమకొండ, మహా** : హనుమకొండలో నిబంధనలు పాటించని వైన్స్ లపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. హనుమకొండ చౌరస్తా, హనుమాన్ నగర్ కేయూ సీ ప్రధాన రోడ్డు మీద, హంటర్ రోడ్ లోని న్యూ శాయంపేట జంక్షన్ దగ్గర, వైన్స్ ల వల్ల ప్రధాన రహదారులు పార్కింగ్ స్థలాలుగా మారి ప్రజలు రోజూ నరకయాతన పడుతున్నా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజల ఇబ్బందుల కంటే ముడుపులకే అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతుండటంతో స్థానిక ప్రజలు కలెక్టర్ కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. హనుమకొండ నగరంలోని హనుమాన్ నగర్ ప్రధాన రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వైన్స్ ల వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం వైన్స్ షాప్ కు తప్పనిసరిగా పార్కింగ్ స్థలం, ఫైర్ సేఫ్టీ ఉండాలి ముఖ్యంగా ఫుడ్ కోర్ట్ లకు పర్మిషన్ లేదు కానీ వైన్స్ ల ముందర నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా నాణ్యతలేని ఫుడ్ కోర్ట్ లు ఉన్నాయి, వైన్స్ లలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతున్నా , వైన్స్ షాప్స్ ప్రాంగణంలో అలాగే రోడ్డు పై బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నగరంలో ఉన్న కొన్ని వైన్స్ లు ఏ ఒక్క నిబంధన పాటించడం లేదని వీటితో స్పష్టమవుతోంది. ప్రధాన రోడ్డుపై ఆటోలు టూవీలర్లు ఇష్టారాజ్యంగా పార్క్ చేస్తున్నారు. సాయంత్రం అయితే చాలు ఈ రోడ్డులో అడుగు పెట్టాలంటేనే భయం వేస్తోందని వాహనదారులు, స్థానిక ప్రజలు చెబుతున్నారు. పాదచారులు నడవడానికి దారి లేక ప్రమాదాల బారిన పడుతున్నారు. మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా ట్రాఫిక్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పలుమార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా నామమాత్రపు తనిఖీల తో సరిపెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో ప్రజల ఇబ్బందులు అధికారులకు పట్టవా? ముడుపులే ముఖ్యమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు సైతం ఈ సమస్యను పట్టించుకోక పోవడం పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక లాభం లేదని భావించిన స్థానిక ప్రజలు, ప్రజా సంఘాల తో కలిసి జిల్లా కలెక్టర్ కు నేరుగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.. పార్కింగ్ లేని వైన్స్ ల లైసెన్స్ లను రద్దు చేయాలని, నిబంధనలు పాటించే వరకు షాపులను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకుని, ఎక్సైజ్, ట్రాఫిక్ అధికారుల నిర్లక్ష్యం పై విచారణ జరిపి, ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# ఉన్నత విద్యా వ్యవస్థను బలోపితం చేయడమే వర్క్ షాప్ లక్ష్యం

- విద్య దృక్పదాల శిక్షణ లీడ్ పరంపర అకాడమిక్స్ ప్రోగ్రాం
- ఘనంగా బిట్స్ పిలానీలో లీడ్ అకాడమిక్ మిక్స్ ప్రోగ్రాం.



**జవహర్ నగర్, మహా**: భారతదేశ ఉన్నత విద్యారంగంలో నాయకత్వ సామర్థ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్ లోని సెంటర్ ఫర్ లీడర్షిప్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ అకాడమిక్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది అక్టోబర్ 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు మూడు రోజులపాటు క్యాంపస్ లో జరిగే ఈ ప్రత్యేక శిక్షణలో విదేశీ, దేశవ్యాప్తంగా దుబాయ్ నుండి ఎంపికైన 15 మంది విద్యాసంస్థలకు చెందిన 31 మంది విద్య నాయకులు పాల్గొంటున్నారు. లీడ్ అకాడమిక్ ప్రోగ్రాం ద్వారా విద్యావేత్తలను తీర్చిదిద్దడంలో బిట్స్ పిలానీ పాత్ర అమోఘమని ఉన్నత విద్యా వ్యవస్థను బలోపితం చేయడమే లక్ష్యంగా మూడు రోజుల వర్క్ షాప్ ని బిట్స్ పిలానీలో ఘనంగా ప్రారంభించారు. లీడ్ అకాడమిక్ ప్రోగ్రాం ద్వారా విద్యావేత్తలను తీర్చిదిద్దడంలో బిట్స్ హైదరాబాద్ క్యాంపస్ ముందంజలో ఉందని భారతదేశం ఉన్నత విద్యా వ్యవస్థ అంతట నాయకత్వ సామర్థ్యాలను బలోపితం చేయడానికి మూడు రోజుల సమగ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని బిట్స్ పిలాని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి 15 సంస్థలకు చెందిన 31 మంది విద్యావేత్తలను ఒకే చోట వేదిక అవుతుందని, ఈ కార్యక్రమం హైదరాబాద్ లోని బిట్స్ పిలానీలో అక్టోబర్ 14వ తేదీ నుండి మొదలవుతుందని అన్నారు. భారత దేశ ఉన్నత విద్యా వ్యవస్థ అంతటా నాయకత్వ సామర్థ్యాలను బలోపితం చేయడంలో చురకైన పాత్ర పోషిస్తూ ఉన్నత విద్యా సంస్థలకు నాయకత్వం వహించడానికి అవసరమైన నైపుణ్యాలు దృక్పథాలతో విద్యా నిర్వహకులను సన్నద్ధం చేయడానికి రూపొందించిన కార్యక్రమమే లీడ్ అకాడమిక్ మిక్స్ ప్రోగ్రాం అని తెలిపారు. విద్య నాయకులను అభివృద్ధి చేసే ప్రయత్నాలకు బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్ నాయకత్వం వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 13వ తేదీ నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు మూడు రోజులపాటు బిట్స్ పిలాని క్యాంపస్లో జరగనున్న ఈ కార్యక్రమానికి భారతదేశం దుబాయ్ నుండి వచ్చిన దరఖాస్తుల నుండి ఎంపిక చేయబడిన 15 సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 31 మంది విద్య మేధావులను ఒకే చోట వేదికగా చేర్చడం ముదావహమన్నారు. బిట్స్ పిలానీలోని సెంటర్ ఫర్ లీడర్షిప్ ఇన్ ఎడ్యుకేషన్ అండ్ ఎకడమిక్ డెవలప్మెంట్ లీడ్ చేపట్టిన ఈ కార్యక్రమం వికసిత భారత్ 2047 జాతీయ దార్శనికతకు అనుగుణంగా భారతదేశంలో ఉన్నత విద్య పూర్వక అభివృద్ధికి దోహద పడగలదని విద్యా నాయకులను అభివృద్ధి చేయాలనే సంస్థ యొక్క ఉద్దేశమన్నారు. దీనికి మొదటి రెండు బ్యాచ్ లలో 74 మంది విద్యావేత్తలు పాల్గొనగా ఈ కార్యక్రమం తన మూడో బ్యాచ్ ద్వారా వివిధ సంస్థలలో నాయకత్వ సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం అక్టోబర్ 13న జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో బిట్స్ పిలానీ గ్రూప్ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ వి .రంగ గోపాలరావు భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి లీడ్ ఎకనామిక్స్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ పి. శంకర్ గణేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్ గణేష్ మాట్లాడుతూ సంస్థలను బలోపితం చేయడంలో నాయకత్వం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ప్రొఫెసర్ బి. రాంగోపాల్రావు మాట్లాడుతూ అకాడమిక్ లీడర్షిప్ వ్యక్తుల పదవీకాలం ముగిసిన తర్వాత కూడా శ్రేష్టత నిలబెట్టే సంస్థలను నిర్మించడం ముఖ్యమైనది అన్నారు. భారత ప్రభుత్వ విద్య మంత్రిత్వ శాఖలో సీనియర్ విద్యా విధాన నిపుణురాలు మాజీ ప్రత్యేక అధికారిని షమ్స్ మాట్లాడుతూ సంస్కాగత శ్రేష్టత సమ్మిళిత నాయకత్వం మానసిక భద్రత ఆధ్యాపకుల శ్రేయస్సు కోసం విద్యావృత్తిని పునర్ సృష్టించడంపై మాట్లాడారు. అనంతరం శ్రీ ఆర్వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉత్తేజకరమైన క్యాంపస్లను సృష్టించడం ద్వారా విద్యార్థుల భాగస్వామ్యం గురించి విద్యార్థి కేంద్రీకృత క్యాంపస్ వాతావరణ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు విద్యావేత్తలు ప్రొఫెసర్లు సాంస్కృతి పరిపాలన అంశాల గురించి మాట్లాడారు. విద్యా ప్రమాణాలను ప్రభావితం చేసే అకాడమిక్ నిర్వాహకుల అభివృద్ధిలో పెట్టుబడి పెట్టడం ద్వారా బిట్స్ పిలాని ఉన్నత విద్యకు తన సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన ప్రముఖులు, ప్రొఫెసర్లు, అక్కడ మీకు కౌన్సిలర్లు, విద్యావేత్తలు, మేధావులు, నిపుణులు తదితరులు పాల్గొన్నారు.



# పోచారంలో 4 ఇందిరమ్మ టవర్స్ కు భూమిపూజ

## 480 మందికి ఫ్లాట్లు

**ఘట్కేసర్ అక్టోబర్ 14 (మహా):** పోచారంలో పేదల కోసం నిర్మించనున్న 4 ఇందిరమ్మ టవర్స్ కు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు భూమిపూజ చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో మొదటి విడతగా ఎంపికైన 480 మంది లబ్ధిదారులకు ఆన్ లైన్ డ్రా ద్వారా ఫ్లాట్లను కేటాయించి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, గతంలో నగర పేదలకు 30 కి.మీ దూరంలో ఇళ్లు ఇవ్వడం వల్ల ఉపాధి, రవాణా ఇబ్బందులు వచ్చేవని, ఇప్పుడు ఏ నియోజకవర్గం వారికి అదే పరిధిలోనే ఇళ్లు ఇస్తున్నామన్నారు. హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 23 నియోజకవర్గాల్లో లక్ష ఇళ్లు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లను రూ.22,500 కోట్లతో నిర్మిస్తున్నామని, గ్రామాల్లో సొంత స్థలం ఉన్నవారికి రూ.5 లక్షల ఆర్థిక సాయం ఇస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులు ఇప్పటికే రూ.10 వేలు, తర్వాత రూ.లక్ష చెల్లించారని, మిగతా మొత్తం కూడా చెల్లిస్తే భారం అవుతుందని, బ్యాంకు రుణం ఇప్పించాలని కోరారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రస్తుత అవసరాలకు సింగిల్ బెడ్రూమ్ సరిపోదని, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు.

# వలసవాదపు చీకటి కోణాలను వెలికితీస్తున్న చారిత్రక ఘట్టం రణబాలి







చరిత్ర అనేది కేవలం గడిచిపోయిన కాలం కాదు, వర్తమాన సమాజాన్ని నడిపించే ఒక అదృశ్య శక్తి. కానీ, వందల ఏళ్లుగా పరాయి పాలకుల కళ్లద్దాల గుండా మన గతాన్ని చూడటం వల్ల, మన సొంత జాతి పడ్డ గాయాలకు, మన పూర్వీకులు చేసిన మహోన్నత పోరాటాలకు మనం పూర్తిగా దూరమయ్యాం. మన జాతి మెదళ్లలో పాతుకుపోయిన ఈ 'సామూహిక విస్మృతిని' (కలెక్టివ్ అమ్నీషియా) పారద్రోలి, ఒక బలమైన సాంస్కృతిక జోక్యంగా (సివిలైజేషనల్ ఇంటర్వెన్షన్) ప్రేక్షకుల ముందుకు రాబోతున్న దృశ్యకావ్యమే "రణబాలి". పాన్ ఇండియా కథానాయకుడు విజయ్ దేవరకొండ, సృజనాత్మక దర్శకుడు రాహుల్ సంకృత్యన్, ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది, రచయిత జె. సాయి దీపక్, మాజీ ఐపీఎస్ అధికారి మరియు సామాజికవేత్త కె. అన్నామలై తదితరుల మధ్య తాజాగా జరిగిన "రణబాలి హిస్టారిక్ కాన్వర్సేషన్" మన చరిత్రలోని ఎన్నో విస్మరించబడిన కఠోర సత్యాలను వెలుగులోకి తెచ్చింది. రాయలసీమలోని పాలెగాళ్ల నేపథ్యంలో, అక్కడి వ్యవసాయ వాతావరణం ఇతివృత్తంగా అక్టోబర్ 16, 2026న విడుదల కాబోతున్న ఈ చిత్రం.. మన సాంస్కృతిక, జన్యుపరమైన అస్తిత్వాన్ని వలసపాలకులు ఎంతలా అమానుషీకరించారో కళ్లకు కట్టబోతోంది. బ్రిటిష్ పాలకుల దృష్టిలో ఈ దేశ మూలవాసులు ఆత్మ కలిగిన మనుషులు కారు, కేవలం తమ అవసరాలు తీర్చే వనరులు మాత్రమే. విగ్రహారాధన చేసే మన సంస్కృతి పట్ల వారికొక అకారణ మతపరమైన ద్వేషం ఉండేది. పద్దెనిమిది, పంతొమ్మిదవ శతాబ్దాల్లో సంభవించిన మద్రాసు కరువు వంటి విపత్తులు ప్రకృతి సహజంగా వచ్చినవి కావని, అవి కేవలం బ్రిటిష్ వారి దోపిడీ కోసం సృష్టించబడిన కృత్రిమ ఉత్పాతాలని ఈ చారిత్రక చర్చలో మేధావులు కుండబద్దలు కొట్టారు. ప్రజలు ఆకలికి తాళలేక చెట్ల బెరడులు తినడం, చీమల పుట్టల్లో గింజలు ఏరుకోవడం, అత్యంత దయనీయంగా నరమాంస భక్షణకు పాల్పడే పరిస్థితులు ఉన్నప్పటికీ.. నాటి వలస ప్రభుత్వం వ్యవసాయంపై 50 నుంచి 60 శాతం మేర పన్నులు వసూలు చేయడం వారి అమానవీయతకు పరాకాష్ట. 18761877 మధ్య కరువు తీవ్ర స్థాయిలో ఉన్న సమయంలో ఒక్క తంజావూరు జిల్లాలోనే 68.7 లక్షల రూపాయల పన్ను (నేటి విలువలో సుమారు ఆరు వేల కోట్లు) వసూలు చేశారంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడి ప్రజలు పిట్టల్లా రాలిపోతుంటే, లక్షలాది టన్నుల బియ్యాన్ని యూరప్, ఆఫ్రికాల్లోని తమ సైన్యాల కోసం వాళ్లు తరలించుకుపోయారు. బకింగ్‌హామ్ కెనాల్ నిర్మాణం లాంటి సహాయక చర్యల పేరుతో దారుణమైన లేబర్ క్యాంపులు నడిపి, కేవలం 450 గ్రాముల గింజల కోసం మన వాళ్లతో ప్రాణాలు పోయేలా వెట్టిచాకిరీ చేయించారు.

ఇంతటి క్రూరమైన అకృత్యాలను బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన నాటి అధికారిక విద్యావ్యవస్థ అత్యంత చాకచక్యంగా కప్పిపుచ్చింది. బెంగాల్ కరువు అమెరికా విప్లవానికి దారితీసిన తరహాలోనే, ఇక్కడి కరువు తాలూకు నిజాలు దేశవ్యాప్తంగా వ్యాపిస్తే తమ మనుగడకు ముప్పు అని గ్రహించి అధికారిక పాఠ్యపుస్తకాల నుంచి ఈ వాస్తవాలను తుడిచేశారు. దీంతో మన అసలు చరిత్ర కేవలం బుర్రకథ, కుమ్మి పాట్టు లాంటి మౌఖిక సంప్రదాయాల్లో (ఓరల్ ట్రెడిషన్స్) మాత్రమే సజీవంగా నిలిచింది. కానీ ఇంగ్లీష్ భాష ఈ దేశీయ సత్యాలను ఉద్దేశపూర్వకంగానే "ఫోక్లోర్" (జానపద కథలు) అనే చులకన పదంతో ముద్రవేసి, వాటికి ఎలాంటి ఆధారాలు లేవన్నట్లుగా చిత్రీకరించింది. ఈ బుర్రకథలు చెప్పే కళాకారులు ఇప్పుడు అంతరించిపోతున్న చివరి తరంగా మిగిలారు. వారిని ఆదుకోకపోతే, మన నిజమైన చరిత్రకు మిగిలి ఉన్న ఏకైక వారధి శాశ్వతంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఈ దారుణమైన చారిత్రక గాయం ప్రభావం గతం వరకే పరిమితం కాలేదు, అది నేటి ఆధునిక భారతీయుల శరీరాల్లో, మనసుల్లో ఇంకా సజీవంగానే ఉందని ఈ చర్చలో విశ్లేషకులు లోతుగా వివరించారు. తరాల తరబడి ఎదుర్కొన్న ఆకలి కేకల వల్ల మన జన్యునిర్మాణం పూర్తిగా మారిపోయింది. దీని ఫలితంగానే నేటి తరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్, డయాబెటిస్ వంటి సమస్యలు రావడం, పిల్లల్లో సైతం క్వాషియోర్కర్ (పెద్ద కడుపులు) వ్యాధి సర్వసాధారణం కావడం జరిగింది. ఎందుకంటే, ఆ భయంకరమైన కరువుల వల్ల మన శరీరాలు భవిష్యత్తు అవసరాల కోసం విపరీతంగా కొవ్వును నిల్వ చేసుకునేలా రూపాంతరం చెందాయి. మానసిక కోణంలో పరిశీలిస్తే, నాటి కరువు సృష్టించిన అభద్రతాభావం మనలో ఒక రకమైన 'శరణార్థి మనస్తత్వాన్ని' (రెఫ్యూజీ మెంటాలిటీ) నాటింది. నేడు శుభకార్యాలకు వెళ్లినప్పుడు ప్లేట్లలో ఎక్కువగా ఆహారం నింపుకోవడం, క్యూ లైన్లలో ఇతరులను నెట్టుకుంటూ ముందుకు వెళ్లడం వంటి ప్రవర్తనలు.. రాత్రికి రాత్రే సర్వస్వం కోల్పోతామేమో అన్న భయంతో బతికిన మన పూర్వీకుల ప్రాణరక్షణ సహజాతాల (సర్వైవల్ ఇన్‌స్టింక్ట్) నుంచి సంక్రమించినవే. ఇన్ని శతాబ్దాల పాటు వ్యవస్థాగత దోపిడీ, విభజనలు జరిగినప్పటికీ మన దేశం ఇంకా నిలబడగలిగిందంటే, దానికి కారణం మనకున్న బలమైన ఆధ్యాత్మిక చైతన్యం, వికేంద్రీకృత సంస్థాగత వ్యవస్థలే అని చిత్రబృందం గుర్తుచేస్తోంది. 'విభజించి పాలించడం' వారి విధానమైతే, కష్టకాలంలో 'కలిసికట్టుగా బతకడం' మన సంస్కృతి. సంక్షోభ సమయాల్లో దేవాలయాల ధాన్యాగారాలు, స్థానిక రాజుల వ్యక్తిగత ధాన్యాగారాలు తెరిచి 'గంజి కేంద్రాల' ద్వారా ఆకలితో అలమటిస్తున్న జనాలకు అండగా నిలిచేవారు. ఈ వ్యవస్థాగత స్వేచ్ఛ వల్లే స్థానిక ప్రజలు బలంగా ఉన్నారని గుర్తించిన బ్రిటిష్ వారు, పన్నాగం పన్ని స్థానిక పూజారులను అవినీతిపరులుగా, స్వార్థపరులుగా చిత్రీకరించి గుడుల నిర్వహణను తమ గుప్పిట్లోకి తీసుకున్నారు. వాస్తవానికి మన నాగరికత ఎప్పుడూ భాషను, ప్రాంతీయ వైవిధ్యాన్ని ఒక అందంగా చూసింది తప్ప, దాన్ని ఒక ఆయుధంగా ఎన్నడూ వాడుకోలేదు. బ్రిటిష్ వారు అడుగుపెట్టిన తర్వాతే, ముఖ్యంగా 1956 రాష్ట్రాల పునర్విభజన తర్వాతే ఈ భాషాధారిత రాజకీయాలు వేళ్లూనుకున్నాయి. ఈ సంభాషణలో సాయి దీపక్, అన్నామలై హెచ్చరించినట్లుగా, గతంలో మన భౌతిక వనరులను ఎలా కొల్లగొట్టారో, ఇప్పుడు డేటా మరియు కృత్రిమ మేధ (AI) సాంకేతికతల రూపంలో సరికొత్త వలసవాదం మన ముంగిట పొంచి ఉంది. మన వినియోగదారుల ప్రవర్తనను, రాజకీయ కథనాలను శాసించే పాశ్చాత్య ఏఐ మోడల్స్ పై (Grok వంటివి) పూర్తిగా ఆధారపడటం వల్ల, మనల్ని మనం ఒక నయావలసవాదానికి (నియోకలోనియలిజం) బానిసలుగా చేసుకుంటున్నాం. పాత చరిత్ర పునరావృతం కాకూడదంటే, మన సొంత సాంకేతిక మౌలిక సదుపాయాలను నిర్మించుకోవడం ద్వారా ఒక ఆత్మనిర్భర (స్వయం సమృద్ధి) ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది.

మన గతాన్ని మనకు సగర్వంగా గుర్తుచేసే ఈ చారిత్రక ఘట్టాన్ని ఎంతో రాజీపడని భారీ వ్యయప్రయాసలతో అక్టోబర్ 16, 2026న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ పాన్ఇండియా ఇతిహాస చిత్రం "రణబాలి"ని దర్శకుడు రాహుల్ సంకృత్యన్ అత్యంత దార్శనికతతో తెరకెక్కిస్తున్నారు. రచయిత ప్రమోద్ తమ్మినేని కలం నుంచి జాలువారిన ఈ శక్తివంతమైన చరిత్రకు ప్రాణం పోస్తూ, మరుగునపడిన మన జాతి గొంతుకగా విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న నటిస్తుండగా, అంతర్జాతీయ ప్రేక్షకులను సైతం కట్టిపడేసేలా ప్రముఖ హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఈ కీలక చిత్రంలో భాగమయ్యారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాను, గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ ల సమర్పణలో టిసిరీస్ ఫిల్మ్స్ దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ చేర్చనుంది. అజయ్‌అతుల్ అందించిన హృద్యమైన సంగీతం, నీరవ్ షా అందించిన అద్భుతమైన ఛాయాగ్రహణం (విజువల్స్) ఈ కథను మరో స్థాయికి తీసుకెళ్లబోతున్నాయి. ఈ చారిత్రక సంభాషణ మనకు నేర్పుతున్న అతిపెద్ద పాఠం ఒకటే.. తమకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని, గాయాన్ని అంగీకరించని సమాజం, ఆ చరిత్రను మళ్లీ పునరావృతం చేయడానికి అవకాశం ఇస్తున్నట్లే. కాలగర్భంలో కలిసిపోయిన మన నిజమైన కథలను "రణబాలి" రూపంలో మళ్లీ ప్రధాన స్రవంతిలోకి (మెయిన్ స్ట్రీమ్) తీసుకురావడం ద్వారా.. ఇకనైనా మనల్ని మనం వలసపాలకుల కళ్లద్దాల గుండా తక్కువ చేసి చూసుకోవడం మానుకోవాలనే ఒక బలమైన సందేశాన్ని ఈ చిత్రం ఇస్తోంది. ఇది మన నాగరికతకు దక్కాల్సిన ఆత్మగౌరవాన్ని తిరిగి తీసుకురావడానికి వస్తున్న ఒక శక్తివంతమైన మేలుకొలుపు.



- శివకుమార్ గనివాడ,
సోషల్ అనలిస్ట్

# గుండెపోటు, పక్షవాతానికి నాలుగు ప్రధాన ముప్పులు!



మనిషి ఆరోగ్యంగా కనిపిస్తున్నంత మాత్రాన గుండె జబ్బులు దరిచేరవని భావించడం పొరపాటే. రోజువారీ పనులను చురుగ్గా చేసుకుంటూ, ఎలాంటి అనారోగ్య లక్షణాలు లేకుండా జీవిస్తున్న వారిలోనూ గుండె సంబంధిత సమస్యలు బయటపడే అవకాశం ఉంది. గుండెపోటు, పక్షవాతం వంటి ప్రాణాంతక సమస్యలు ఒక్కసారిగా సంభవించినట్లు అనిపించినప్పటికీ, వాటి వెనుక చాలాకాలంగా కొనసాగుతున్న ఆరోగ్య సమస్యలు ఉండవచ్చని వైద్య పరిశోధనలు సూచిస్తున్నాయి. తొమ్మిది మిలియన్లకు పైగా పెద్దల ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించిన ఒక అధ్యయనం గుండెపోటు, పక్షవాతం, గుండె వైఫల్యం వంటి సమస్యలకు సంబంధించి నాలుగు ప్రధాన ప్రమాద కారకాలపై దృష్టి సారించింది. అధిక రక్తపోటు, రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడం, రక్తంలో చక్కెర అధికంగా ఉండటం, పొగాకు వినియోగం వీటిలో ముఖ్యమైనవి. ఈ సమస్యలను సకాలంలో గుర్తించి నియంత్రించగలిగితే గుండె ఆరోగ్యాన్ని కాపాడుకునే అవకాశాలు మెరుగుపడతాయి.



**నిశ్శబ్దంగా పెరిగే రక్తపోటు:** అధిక రక్తపోటును వైద్యులు తరచుగా ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యగా పరిగణిస్తారు. ఎందుకంటే చాలామందిలో ఇది స్పష్టమైన లక్షణాలను చూపించకుండానే సంవత్సరాల తరబడి కొనసాగుతుంది. రక్తపోటు ఎక్కువగా ఉన్నప్పుడు రక్తనాళాలపై ఒత్తిడి పెరుగుతుంది. కాలక్రమేణా రక్తనాళాల గోడలు దెబ్బతినడంతో పాటు గుండెపై అదనపు భారం పడుతుంది. ఫలితంగా గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదం పెరగవచ్చు. తలనొప్పి, తల తిరగడం వంటి లక్షణాలు కనిపించినప్పుడే రక్తపోటు ఉందని భావించడం సరికాదు. ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా క్రమం తప్పకుండా రక్తపోటును పరీక్షించుకోవడం అవసరం. వైద్యులు సూచించిన చికిత్సను పాటించడం, ఉప్పు అధికంగా ఉండే ఆహారాన్ని తగ్గించడం, శారీరక చురుకుదనాన్ని పెంచుకోవడం ద్వారా రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవచ్చు.

**కొలెస్ట్రాల్‌తో రక్తనాళాలకు ముప్పు:** శరీరానికి కొంత కొలెస్ట్రాల్ అవసరమే అయినప్పటికీ, చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) అధికంగా ఉండటం ఆరోగ్యానికి హానికరం. ఇది రక్తనాళాల లోపలి గోడలపై కొవ్వు పదార్థాలు పేరుకుపోవడానికి దోహదపడుతుంది. కాలక్రమేణా రక్తప్రసరణకు అడ్డంకులు ఏర్పడవచ్చు. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనుల్లో అడ్డంకులు ఏర్పడితే గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. మెదడుకు రక్తప్రసరణ దెబ్బతింటే పక్షవాతం సంభవించవచ్చు. ముఖ్యంగా కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారిలో చాలాసార్లు ఎలాంటి ప్రత్యేక లక్షణాలు కనిపించవు. అందువల్ల ఆరోగ్యంగా ఉన్నామని భావించి పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదు. అవసరాన్ని బట్టి లిపిడ్ ప్రొఫైల్ పరీక్ష చేయించుకోవాలి. వేయించిన పదార్థాలు, అధికంగా సంతృప్త కొవ్వులు కలిగిన ఆహారాన్ని తగ్గించి, కూరగాయలు, పండ్లు, పీచు పదార్థాలు కలిగిన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. మందులు అవసరమైతే వైద్యుల సూచన మేరకు మాత్రమే తీసుకోవాలి.

**రక్తంలో చక్కెర పెరిగితే జాగ్రత్త:** మధుమేహం కూడా గుండె, రక్తనాళాల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ప్రధాన సమస్యల్లో ఒకటి. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉన్నప్పుడు రక్తనాళాలకు క్రమంగా నష్టం కలగవచ్చు. దీనివల్ల గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ప్రారంభ దశలో మధుమేహం ఉన్నప్పటికీ కొందరిలో దాహం పెరగడం, తరచుగా మూత్రవిసర్జన, అలసట వంటి లక్షణాలు స్పష్టంగా కనిపించకపోవచ్చు. అందుకే అవసరమైనప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకోవడం ముఖ్యం. ఉపవాస రక్తచక్కెర పరీక్ష, హెచ్‌బీఏ1సీ పరీక్షల ద్వారా పరిస్థితిని అంచనా వేయవచ్చు. ఆహారపు అలవాట్లలో మార్పులు, క్రమబద్ధమైన వ్యాయామం, తగిన నిద్ర, వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవడం ద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చు. ఇప్పటికే మధుమేహం ఉన్నవారు రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఈ సమస్యలు కలిసివచ్చినప్పుడు గుండె సంబంధిత ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

**పొగాకు వినియోగం మరో ప్రమాదం:** ధూమపానం, ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగం గుండె ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తాయి. పొగాకులోని హానికర పదార్థాలు రక్తనాళాలను దెబ్బతీయడంతో పాటు రక్తంలో ఆక్సిజన్ సరఫరాపై ప్రభావం చూపుతాయి. రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయే ప్రక్రియ వేగవంతం కావడానికి కూడా ఇవి దోహదపడతాయి. ధూమపానం చేసే వ్యక్తులకే కాకుండా పక్కన ఉండి పొగను పీల్చేవారికీ ఆరోగ్య పరమైన ముప్పు ఉంటుంది. పొగాకు వినియోగాన్ని మానేయడం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు తీసుకోగల ముఖ్యమైన చర్య. అవసరమైతే వైద్యుల సలహా, కౌన్సెలింగ్ సహాయం తీసుకోవచ్చు. ఇప్పటికే గుండె సంబంధిత సమస్యలు ఉన్న వారు పొగాకుకు పూర్తిగా దూరంగా ఉండాలి.

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అంటే ఒక్క వ్యాయామం చేయడం లేదా బరువును నియంత్రించుకోవడం మాత్రమే కాదు. సమతుల ఆహారం తీసుకోవడం, రోజూ తగినంత శారీరక శ్రమ చేయడం, నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం కూడా అవసరం. కుటుంబంలో చిన్న వయసులోనే గుండె జబ్బులు వచ్చిన చరిత్ర ఉన్నవారు వైద్యుల సలహా మేరకు ముందస్తు పరీక్షలు చేయించుకోవాలి. అలాగే వయస్సు, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితి, ఇతర ప్రమాద కారకాల ఆధారంగా వైద్య పరీక్షల వ్యవధిని నిర్ణయించుకోవడం మంచిది.

గుండెపోటు వచ్చినప్పుడు ఛాతీలో ఒత్తిడి లేదా నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చల్లని చెమటలు, వికారం, చేతులు లేదా దవడకు వ్యాపించే నొప్పి వంటి లక్షణాలు కనిపించవచ్చు. పక్షవాతం సందర్భంలో ముఖం ఒకవైపు వాలిపోవడం, ఒక చేయి బలహీనపడటం, మాట తడబడటం వంటి లక్షణాలు అకస్మాత్తుగా రావచ్చు. ఇవి కనిపిస్తే ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్య సహాయం పొందాలి. లక్షణాలు తగ్గుతాయేమోనని వేచి చూడటం ప్రమాదకరం.

గుండెపోటు, పక్షవాతం వచ్చే ప్రమాదాన్ని పూర్తిగా తొలగించగలమని చెప్పలేం. అయితే రక్తపోటు, కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెర స్థాయిలను పర్యవేక్షించడం, పొగాకుకు దూరంగా ఉండటం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా ప్రమాదాన్ని తగ్గించుకునే అవకాశం ఉంది. ఆరోగ్యం బాగున్నప్పుడే జాగ్రత్తలు తీసుకోవడం, సమస్యలు బయటపడిన తర్వాత చికిత్స కోసం పరుగులు పెట్టడం కంటే ఎంతో మేలు. క్రమం తప్పని వైద్య పరీక్షలు, సరైన అవగాహన, సమయానికి చికిత్స గుండె ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి.



# భక్తిశ్రద్ధలతో పుత్రకామేష్టి యాగం

**భక్తులకు సంతానలక్ష్మీ రూపంలో దర్శనం...**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల్ లో శ్రీరామ్నగర్ 'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ' (సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం) ప్రాంగణంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గోవ రోజు బుధవారం అమ్మవారు భక్తులకు సంతానలక్ష్మీ దేవి అలంకరణలో అభయమిచ్చారు.

త్రిదండి శ్రీ చిన్నజీయర్ స్వామి మార్గదర్శకత్వంలో దివ్యసకేత క్షేత్రంలో శరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు అమ్మవారిని సంతానలక్ష్మీ స్వరూపంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వంశాభివృద్ధిని, సంతాన సౌభాగ్యాలను ప్రసాదించే లక్ష్మీదేవి రూపాన్ని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**ఘనంగా పుత్రకామేష్టి యాగం**

ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా యాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కల్యాణాన్ని, సకల జనుల ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ ఋత్విక్కులు, వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య ఈ విశేష హోమ క్రతువును కనులపండువగా చేపట్టారు. యాగశాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు.

అమ్మవారి దివ్య అలంకరణలు, విశేష హోమాలు, వేద పండితుల మంత్రోచ్చారణలతో ముచ్చింతల్ క్షేత్రమంతా ఆధ్యాత్మిక పరిమళాలతో వెల్లివిరిసింది

# లాభాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కోత

- వాస్తవ లాభాలు దాచిపెట్టి కార్మికులకు అన్యాయం
- రూ.59 వేల కోట్ల బకాయిలు చెల్లించకుంటే బొగ్గు సరఫరా నిలిపివేత దిశగా ఉద్యమం
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ హెచ్చరిక




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి కార్మికుల కష్టార్జితానికి న్యాయమైన వాటా కల్పించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవ లాభాలను ప్రకటించకుండా కార్మికులకు అన్యాయం చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కార్మికుల శ్రమతో వేల కోట్ల ఆదాయం ఆర్జిస్తున్న సంస్థలో, లాభాల వాటాను గత ఏడాది ఇచ్చిన 34 శాతానికే పరిమితం చేయడం కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందని విమర్శించారు. బుధవారం కొత్తగూడెం శేషగిరి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెల్లడించకుండా కేవలం రూ.1,754 కోట్ల లాభాలనే ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొన్నారు. గత ఏడాది ఇచ్చిన 34 శాతం లాభాల వాటానే ఈ ఏడాది కూడా కొనసాగించడం ద్వారా కార్మికులకు అదనంగా ఒక్క శాతం కూడా పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల చెమటోడ్చి సాధించిన లాభాల్లో న్యాయమైన వాటా ఇవ్వాల్సింది పోయి లాభాల లెక్కలనే ప్రశ్నార్థకం చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. లాభాల వాటా నిర్ణయించే ముందు గుర్తింపు సంఘంతో చర్చించాల్సిన బాధ్యత యాజమాన్యానికి ప్రభుత్వానికి లేదా..? అని ఏఐటీయూసీ నాయకులు ప్రశ్నించారు. గుర్తింపు సంఘాన్ని సమావేశానికి పిలిస్తే వాస్తవ లాభాలపై ప్రశ్నలు ఎదురవుతాయని కార్మికులకు వాటా శాతం పెంచాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే సంప్రదింపులకు దూరంగా పెట్టారని ఆరోపించారు. సింగరేణి ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలను పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో మాత్రమే చర్చించి లాభాల వాటాను ప్రకటించడం కార్మికుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చినట్లుగా ఉందన్నారు. సింగరేణి సంస్థకు జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నప్పటికీ వాటిని వసూలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ధ్వజమెత్తారు. ఒకవైపు సింగరేణి కార్మికులకు లాభాల వాటా పెంచకుండా కోత విధిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు సంస్థకు రావాల్సిన భారీ బకాయిలపై మాత్రం ప్రభుత్వం స్పందించడం లేదని సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బకాయిల వసూళ్ల కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విద్యుత్ సౌధ ముట్టడి చేపట్టామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కను, ఆయన ప్రిన్సిపల్ సెక్రటరీని పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినా స్పందన రాలేదన్నారు. ప్రభుత్వం ఇకనైనా మేల్కొని సింగరేణికి రావాల్సిన రూ.59 వేల కోట్లను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తాం. అవసరమైతే జెన్‌కో, ట్రాన్స్‌కోకు బొగ్గు సరఫరా నిలిపివేసే దిశగా ఉద్యమాన్ని తీసుకెళ్తాం అని వారు హెచ్చరించారు. సమ్మె నోటీసులో పేర్కొన్న 24 డిమాండ్లపై ఒప్పందం కుదిరినా వాటి పరిష్కారంలో ఒక్కో డిమాండ్‌ను పరిష్కరిస్తూ మిగిలిన సమస్యలను కూడా త్వరగా పరిష్కరిస్తామని యాజమాన్యం తెలిపిందని అన్నారు. ఒప్పందంలోని అన్ని డిమాండ్లను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని కోరారు. సింగరేణిలో రాజకీయ జోక్యాన్ని తగ్గించి కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. అలాగే సింగరేణి ప్రాంతాల్లోనే సీఎస్ఆర్ నిధులను వినియోగించి స్థానిక ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్మికుల శ్రమతో సంస్థ లాభాలు ఆర్జిస్తూ అదే కార్మికులకు న్యాయమైన వాటా ఇవ్వడంలో వెనుకడుగు వేయడం అన్యాయమని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిల వసూలు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులను చైతన్యపరిచి ఐక్య ఉద్యమాన్ని నిర్మిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులను విస్మరిస్తే చూస్తూ ఊరుకోబోమని సింగరేణి ప్రయోజనాల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, నాగయ్య, పిట్ కార్యదర్శిలు నరేష్, కమల్, నాయకులు బండారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# దుమ్ము సమస్యపై రాస్తారోకో..!

- ఆస్తులపై సవాళ్లు!
- మణుగూరులో బీఆర్ఎస్ ఆందోళన..
- ఎమ్మెల్యే పాయంపై రేగా ఆరోపణలు
- నా ఆస్తులు.. నీ ఆస్తులు తేల్చుకుందాం రా.. : మాజీ ఎమ్మెల్యే రేగా
- ముందు నీ ఆస్తుల లెక్కలు చెప్పు.. : కాంగ్రెస్ నేతల ప్రతిసవాల్

**మణుగూరు, మహా :** మణుగూరు పట్టణంలో గుంతల రహదారులు, దుమ్ముధూళి సమస్యలపై బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళన రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలకు వేదికైంది. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు రాస్తారోకో నిర్వహించాయి. దుమ్ము ధూళి నుంచి మణుగూరు ప్రజలను కాపాడాలని, అధ్వానంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇది సోషల్ మీడియా వేదికగా చర్చనీయాంశంగా మారింది. తన పామాయిల్ తోటపై పదేపదే ఫిర్యాదులు చేయిస్తూ అటవీ, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులను పంపిస్తున్నారని రేగా ఆరోపించారు. తన పది ఎకరాల భూమిపైనే దృష్టి సారించడం ఎందుకని ప్రశ్నించారు. తుమ్మలచెరువులో పాయం కొనుగోలు చేసినట్లు తాను ఆరోపిస్తున్న 50 ఎకరాల భూమి సంగతేంటని నిలదీశారు. అందులో ప్రభుత్వ, అటవీ భూములు ఉన్నాయని ఆరోపించారు. మొరంపల్లి బంజర, దుమ్ముగూడెం, హైదరాబాద్ ప్రాంతాల్లోని ఆస్తుల వివరాలను కూడా బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఇద్దరం జిల్లా కలెక్టర్ ఎదుట ఆస్తుల వివరాలు సమర్పించి నిజానిజాలు తేల్చుకుందామని సవాల్ విసిరారు. వారసత్వంగా వచ్చిన ఆస్తులెన్ని, ఆ తర్వాత సంపాదించినవెన్ని అనేది మీడియా సమక్షంలో వెల్లడించేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. అక్రమ ఆస్తులున్నట్లు నిరూపిస్తే వాటిని పేదలకు పంచేందుకు తాను సిద్ధమని, ఎమ్మెల్యే పాయం కూడా సిద్ధపడాలని సవాల్ చేశారు. ఈ ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రేగా ఆస్తుల లెక్కలు బయటపెట్టాలి.. : ఓరుగంటి రమేష్‌బాబు**

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై రేగా కాంతారావు చేసిన ఆరోపణలను అశ్వాపురం మండల కాంగ్రెస్ నాయకులు ఖండించారు. ఇతరుల ఆస్తుల గురించి మాట్లాడే ముందు రేగా తన ఆస్తుల వివరాలను బహిర్గతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. 2009 ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించిన ఆస్తులకు, ప్రస్తుతం ఉన్న ఆస్తులకు మధ్య వివరాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. రథంగుట్ట భూముల వ్యవహారం, భూలావాదేవీలు, అటవీ భూములపై వస్తున్న ఆరోపణల విషయంలో ఆధారాలతో బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఆరోపణలు చేయడం కాకుండా పూర్తి ఆస్తుల వివరాలతో చర్చకు రావాలని రేగాకు ప్రతిసవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీల అభ్యున్నతి ఒక్క బీజేపీతోనే సాధ్యం

**తెలంగాణ బాజాప రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**

మంచిర్యాల, మహా ప్రతినిధి : ఎస్సీల అభ్యున్నతి ఒక్క బీజేపీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి స్పష్టం చేశారు. దళితుల అభివృద్ధి అనేది బీజేపీకి కేవలం నినాదం కాదని, అది ప్రధాని నరేంద్ర మోడీ ఆచరణలో చూపిస్తున్న నిబద్ధత అని ఆయన కొనియాడారు. మంచిర్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు. జిల్లా అధ్యక్షులు నగనూరి వెంకటేశ్వర గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణ దేవరాయలతో కలిసి నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు ఎస్సీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నాయని, కానీ బీజేపీ ప్రభుత్వం మాత్రమే రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ప్రశంసించారు. స్టాండ్‌అప్ ఇండియా, విద్యా, ఉపాధి రంగాల్లో ఎస్సీ యువతకు అందిస్తున్న చేయూత నిజమైన సామాజిక న్యాయానికి నిదర్శనమని అన్నారు. మంచిర్యాల జిల్లాలో ఎస్సీ మోర్చా నూతన కమిటీ గ్రామ స్థాయి వరకు వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి దళిత కుటుంబానికి చేరవేసి, ఎస్సీల సంక్షేమానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు పట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# దుమ్ము సమస్య పక్కదారి పట్టిందా..?

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల ప్రజలను వేధిస్తున్న దుమ్ము ధూళి, గుంతల రహదారుల సమస్యపై ప్రారంభమైన రాజకీయ ఆందోళన చివరకు నేతల వ్యక్తిగత ఆస్తుల వివాదం వైపు మళ్లింది. బుధవారం అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చేసిన ఆరోపణలు, వాటికి కాంగ్రెస్ నాయకులు విసిరిన ప్రతిసవాళ్లు స్థానిక రాజకీయాల్లో చర్చకు దారితీశాయి. అయితే ఈ రాజకీయ వాదోపవాదాల మధ్య మణుగూరు ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలకు పరిష్కారం ఎప్పుడు లభిస్తుందన్న ప్రశ్న తెరపైకి వస్తోంది.

# టీకాల పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

**మంచిర్యాల డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్**

**మందమర్రి, మహా :** టీకాల పంపిణీలో నిర్లక్ష్యం వద్దని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం మందమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మేడారం ఆయుష్మాన్ ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. జాతీయ టీకాల కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, చిన్నారులకు అందిస్తున్న వ్యాక్సిన్ల పనితీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యాక్సినేషన్ సెషన్ ముందు ఆశా కార్యకర్తల నుండి డ్యూ లిస్ట్ తీసుకుని, లబ్ధిదారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. కోల్డ్ చైన్ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. వ్యాక్సిన్ వేసేటప్పుడు తల్లీబిడ్డలను సరైన రీతిలో కూర్చోబెట్టాలని, అనంతర జాగ్రత్తలను వివరించాలని సూచించారు. రోజువారీ వ్యాక్సినేషన్ వివరాలను యువిన్ పోర్టల్ లో నమోదు చేయాలని, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సమన్వయంతో 100 శాతం టీకాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో అన్ని రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, టీకాలతో పాటు జ్వరాలు, అసంక్రమిత వ్యాధులు, మాతా శిశు సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఉప కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజలతో సమన్వయంగా ఉంటూ ఫిర్యాదులకు తావు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ప్రమీల, ఆశా కార్యకర్త శంకరమ్మ, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, మందమర్రి పీహెచ్సీ సూపర్ వైజర్లు విజయ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ

**సత్తుపల్లి, అక్టోబరు 14: మహా :** గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు చేపట్టిన 18వ విడత సామాజిక తనిఖీలో భాగంగా సత్తుపల్లి మండలంలో గురువారం బహిరంగ విచారణ నిర్వహించనున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు పూర్తయ్యాయి. అక్టోబరు 15న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో విచారణ జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలిపారు. అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు హాజరుకావాలని కోరారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు, వాటి ఖర్చులు, కూలీలకు చెల్లించిన వేతనాలు, సంబంధిత రికార్డులను పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా పథకం అమలులోని లోపాలను, దినసరి కూలీల అభియోగాలను గుర్తించనున్నారు.



# కారేపల్లి పశువైద్యశాలకు తాళం.. పశుపోషకులకు తిప్పలు!

- వైద్యాధికారి ఆంధ్రకు.. అసిస్టెంట్ ఖమ్మంకు!
- సిబ్బంది గైర్హాజరుతో వైద్యసేవలకు ఆటంకం?
- ఫొటోలు తీస్తే మీడియాపై గోపాలమిత్ర ఆగ్రహం!

**కారేపల్లి,మహా:** కారేపల్లి ప్రభుత్వ పశువైద్యశాలలో సిబ్బంది అందుబాటులో లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. బుధవారం వైద్యాధికారి ఇందిరా డెయిరీకి సంబంధించిన గేదెల ఎంపిక కోసం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లగా, వెటర్నరీ అసిస్టెంట్ బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు ఖమ్మం వెళ్లినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ పశువైద్యశాలకు తాళం పడటంతో సేవల కోసం వచ్చే పశుపోషకులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

**ఫొటోలు తీస్తే ఆగ్రహం!**

తాళం వేసిన కార్యాలయాన్ని మీడియా ప్రతినిధులు ఫొటోలు తీస్తుండగా, గోపాలమిత్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బంది భోజనానికి వెళ్లారని చెప్పినట్లు తెలిసింది. అనంతరం కార్యాలయాన్ని తెరిచినట్లు సమాచారం. సిబ్బంది అందుబాటులో లేని సమయంలో కార్యాలయ నిర్వహణ బాధ్యతలు ఎవరు చూస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**అధికారుల పర్యవేక్షణ ఏది?**

ప్రభుత్వ పశువైద్యశాలలో సిబ్బంది అందుబాటులో లేకపోతే పశువులకు అత్యవసర వైద్యం అందడంపై ప్రభావం పడే అవకాశం ఉంది. విధుల నిర్వహణ, కార్యాలయం మూసి ఉన్న వ్యవధిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, పశుపోషకులకు నిరంతర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోసం జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.



# బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..

- భద్రాద్రి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన సింగరేణి జీఎం దుర్గం రామచందర్

**మణుగూరు, మహా :** సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 18న భద్రాద్రి స్టేడియంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను బుధవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేడుకలకు హాజరయ్యే సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, పరిశుభ్రత, సీటింగ్ సౌకర్యం, మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. స్టేడియం నుంచి బతుకమ్మ నిమజ్జనం చేసే నీటి కొలను వరకు రహదారి సౌకర్యం కల్పించాలని, తగినంత భద్రతా సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. వేడుకలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్వో టు జీఎం డి.వెంకటరామారావు, ఏజీఎం (పర్సనల్) సలగల రమేష్, ఏరియా ఇంజనీర్ వి మదన్‌నాయక్, డీజీఎం (సివిల్) జి శివప్రసాద్, ఏరియా సెక్యూరిటీ అధికారి కె శ్రీనివాస్, ఏరియా రక్షణ అధికారి జి నాగేశ్వరరావు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ బి శ్యామ్‌ప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారులు కె.శ్రీనివాస్, పి రామేశ్వరరావు, ఎస్ఈ (ఈఅండ్ఎం) శోభన్‌బాబు, డిప్యూటీ ఎస్ఈ (సివిల్) రాజేంద్రప్రసాద్, సివిల్ సూపర్‌వైజర్ ఎ సత్యనారాయణ, ఫిట్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో దుర్గామాత మండపం వద్ద మహా అన్నదానం

- అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు..

**కారేపల్లి, మహా:** కారేపల్లి మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల శివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద బుధవారం మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకరణలో ముస్తాబు చేయగా,భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహా అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లోనూ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఆయా మండపాల్లో అమ్మవారిని వివిధ అలంకరణలతో అలంకరించి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించారు.పలువురు దంపతులు పీటలపై కూర్చొని పూజల్లో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.దీంతో మండలంలోని పలు గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. దుర్గామాత మండపాల వద్ద భక్తుల సందడి కనిపించింది.





# టీజీవోస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

- బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను ఆర్డీవో గంగయ్య తో కలిసి విడుదల చేసిన
- టీజీవోస్ అధ్యక్షులు తూము రవీందర్ పటేల్

**ద్దపల్లి మహా** : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని టీజీవోస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ సంబరాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆర్డీవో గంగయ్య తో కలిసి టీజీవోస్ జిల్లా అధ్యక్షులు, డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తూము రవీందర్ పటేల్, సంఘం నాయకులు టీజీవోస్ సభ్యులు , ఉద్యోగులు కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల సాంస్కృతిక వైభవానికి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని వారు ఆకాంక్షించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల్లో ఉద్యోగులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# రాఘవాపూర్ ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు

**పెద్దపల్లి మహా** : మండలం రాఘవాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న రాఘవాపూర్ ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్)ను బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే శ్రీ చింతకుంట విజయరమణ రావు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు జెర్సీలు, బ్యాట్లను అందజేసి క్రీడలను త్సహించారు. అనంతరం గ్రామంలో దుర్గాభవాని నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ విజయరమణ రావు భక్తులకు స్వయంగా అమ్మవారి ప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, క్రీడాకారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో వెలిచాల రాజేందర్‌రావు భేటీ

- కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ బలో-పేతానికి ప్రత్యేక కార్యాచరణ
- వివిధ అంశాలపై చర్చించిన వెలిచాల రాజేందర్ రావు

**మహా కరీంనగర్**: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఢిల్లీలో బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను, ఉత్తరప్రదేశ్ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సహారాన్ పూర్ లోక్‌సభ సభ్యుడు ఇమ్రాన్ మసూద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరిస్తున్న కార్యాచరణ గురించి మల్లికార్జున ఖర్గే కు రాజేందర్‌రావు వివరించారు.
కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం క్షేత్రస్థాయిలో చేపట్టిన కార్యక్రమాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ నిర్వహించిన అంశాల గురించి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు వివరించారు. అదేవిధంగా కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో అత్యధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించేందుకు కృషి చేశానని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

**పార్టీ శ్రేణులకు నిరంతరం అందుబాటులో..**
కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని రాజేందర్‌రావు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని వివరించారు.

**ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చర్యలు..**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన పేదలకు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాజేందర్‌రావు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నామని మల్లికార్జున ఖర్గేకు వివరించారు. కరీంనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో కరీంనగర్ నియోజకవర్గంలో మరింత కష్టపడి పని చేస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతతో పాటు రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచనలు చేశారని రాజేందర్ రావు తెలిపారు

# డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- ఎనిమిది నెలలైనా బీజేపీ మేయర్ పాలకవర్గం నిర్లక్ష్యం..
- ఢిల్లీ నుంచి ఆర్మీ జవాన్ ఆవేదన..
- బతుకమ్మలతో మహిళల నిరసన పట్టదా..?
- డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేశ్ డిమాండ్



**కరీంనగర్ మహా** : కరీంనగర్ నగరంలోని డంపింగ్ యార్డు సమస్యపై పాలకులు, అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డీసీసీ అధికార ప్రతినిధి అనంతుల రమేశ్ డిమాండ్ చేశారు. బీజేపీ మేయర్, పాలకవర్గం బాధ్యతలు చేపట్టి ఎనిమిది నెలలు కావస్తున్నా ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న డంపింగ్ యార్డు సమస్య పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చెత్త నుంచి వెలువడుతున్న పొగ, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో పాలకులు తమ బాధ్యతను గుర్తించాలని సూచించారు.
ఢిల్లీ నుంచి ఆర్మీ జవాన్ ఆవేదన.. బతుకమ్మలతో నిరసన పట్టదా .?
డంపింగ్ యార్డు సమస్య తీవ్రతకు ఢిల్లీలో ఉన్న ఓ ఆర్మీ జవాన్ తన కుటుంబ సభ్యులు, పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేయడమే నిదర్శనమని రమేశ్ పేర్కొన్నారు. మరోవైపు, వివిధ కాలనీలకు చెందిన మహిళలు, స్థానికులు బతుకమ్మలతో నిరసన వ్యక్తం చేయడం సమస్య తీవ్రతను తెలియజేస్తోందన్నారు. ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చుకోలేని పరిస్థితి నెలకొన్నా బిజెపి పాలకులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

**రూ.50 కోట్ల హామీ ఏమైంది?**
2022 జూన్ 7న అప్పటి మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, అప్పటి మేయర్ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డు బయోమైనింగ్ పనులు ప్రారంభించారని రమేశ్ గుర్తుచేశారు. అప్పట్లో రూ.16 కోట్లతో చెత్తను శుద్ధి చేసి ఏడాదిలోపు డంపింగ్ యార్డును ఖాళీ చేస్తామని ప్రకటించారని తెలిపారు. అదేవిధంగా కొత్త స్థలంలో చెత్త నిర్వహణకు రూ.50 కోట్లు కేటాయించినట్లు అప్పటి పాలకులు ప్రకటించారని పేర్కొన్నారు. రోజుకు సుమారు 200 మెట్రిక్ టన్నుల చెత్త చేరుతుండగా, లక్షల టన్నుల వ్యర్థాలు పేరుకుపోయాయని తెలిపారు. ఇన్ని హామీలు ఇచ్చినా సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు.

**ఎనిమిది నెలలుగా ఏం చేస్తున్నారు?**
బీజేపీ మేయర్, పాలకవర్గం అధికార పగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా డంపింగ్ యార్డు సమస్యపై స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని రమేశ్ విమర్శించారు. ప్రజల ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చొరవ చూపాల్సిన పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వేసవిలో చెత్తకు మంటలు అంటుకుని దట్టమైన పొగ వ్యాపించడం, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడటం పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదన్నారు.

**గడువుతో కూడిన కార్యాచరణ ప్రకటించాలి**
డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించడంతో పాటు కొత్త చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని రమేశ్ డిమాండ్ చేశారు. గతంలో ప్రకటించిన రూ.50 కోట్ల కేటాయింపులు, చెత్త నిర్వహణ ఏర్పాట్లు, బయోమైనింగ్ పనుల ప్రస్తుత పరిస్థితిపై అధికారులు స్పష్టత ఇవ్వాలన్నారు. సమస్య పరిష్కారానికి ఎంత సమయం పడుతుంది, ఏయే చర్యలు చేపడతారు అనే వివరాలతో గడువుతో కూడిన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డు సమస్యపై ఇకనైనా నిర్లక్ష్యం వీడాలని అనంతుల రమేశ్ డిమాండ్ చేశారు. గత పాలకుల హామీలు నీటి మూటలుగా మిగిలాయని విమర్శించిన ఆయన, ప్రస్తుత బీజేపీ మేయర్, పాలకవర్గమైనా ప్రజల ఆవేదనను గుర్తించి డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.



# నిజాయితీకి నిదర్శనం..

**దొరికిన సెల్‌ఫోన్‌ను యజమానికి అప్పగించిన మల్లాపూర్ లైన్మెన్ పవన్ కుమార్**

**పెద్దపల్లి మహా:** నిజాయితీ, మానవత్వానికి నిదర్శనంగా మల్లాపూర్ లైన్మెన్ పవన్ కుమార్ నిలిచారు. బంజర్‌పల్లి సమీపంలో విధి నిర్వహణలో ఉండగా ఆయనకు ఒక రియల్‌మీ సెల్‌ఫోన్ దొరికింది. ఆ సెల్‌ఫోన్ ఎలిగేడు మండలం శివపల్లె గ్రామానికి చెందిన శివది అని గుర్తించారు. అనంతరం మల్లాపూర్ సర్పంచి ద్వారా సెల్‌ఫోన్‌ను శివ తండ్రికి తిరిగి అందజేశారు. దొరికిన వస్తువును తన సొంతంగా భావించకుండా, దాని యజమానికి తిరిగి అందజేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నేటి రోజుల్లో ఇలాంటి నిజాయితీ, మానవతా విలువలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. పవన్ కుమార్ చేసిన ఈ మంచి పనిని పలువురు అభినందిస్తున్నారు.



# కార్మిక గర్జనకు.. భారీగా తరలిన కార్మికులు..

- జెండా ఊపి బస్సును ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే రేగా..

**మణుగూరు, మహా** : గోదావరిఖనిలో నిర్వహిస్తున్న సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభకు మణుగూరు ఏరియా నుంచి తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం నాయకులు, కార్మికులు భారీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సూచనలతో టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు సభకు బయలుదేరారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ మార్గదర్శకత్వంలో మణుగూరు ఏరియా నుంచి కార్మికులను సమీకరించారు. సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, సంక్షేమమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ సభకు కార్మికులు పెద్దఎత్తున తరలివెళ్లినట్లు సంఘం నాయకులు తెలిపారు. సింగరేణి సంస్థ పరిరక్షణతో పాటు కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్మిక గర్జన సభను విజయవంతం చేసేందుకు మణుగూరు ఏరియా నుంచి పెద్దసంఖ్యలో కార్మికులు తరలివెళ్లడం పట్ల టీబీజీకేఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు, టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన టిపిసిసి ప్రచార కమిటీ కన్వీనర్ స్వామి

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణం బుడిదగడ్డ బస్తీ, 22వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నేత మత్తమారి చంద్రశేఖర్ మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందడంతో టి బి సి జి ప్రచార కమిటీ కన్వీనర్ స్వామి పరామర్శించి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీర్తిశేషులు మత్తమరి చంద్రశేఖర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అపారమైన దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని మృతుడి కుటుంబానికి ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.






# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం..

- అర్హులందరికీ గృహ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం..
- ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే పాయం..

**మణుగూరు, మహా** : నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, పినపాక నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఎంపీవో, హౌసింగ్ ఏఈ, కాంగ్రెస్ మండల, పట్టణ, మైనారిటీ, మహిళా విభాగాల అధ్యక్షులు, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల అంశం నాన్చుడు ధోరణి అవలంబిస్తే ప్రభుత్వానికి నష్టం

**సంగిశెట్టి క్రిస్టఫర్**
**టి ఎం యు ఎస్ రాష్ట్ర అధ్యక్షులు**

**భువనగిరి అక్టోబర్ 14 మహా న్యూస్** : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల అంశం కాలయాపన చేస్తూ నాన్చుడు ధోరణి అవలంబిస్తే ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ తీవ్రంగా విమర్శించారు త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో బలిదానాలు ఎన్నో త్యాగాలు ఎన్నో పోరాటాలు ఇవన్నీ ప్రభుత్వానికి ఎందుకు గుర్తుకు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల అంశం నత్త నడకన నడవడం పట్ల ఉద్యమకారులు ఇప్పటికీ ఆవేదనతో ఉన్నారని ప్రభుత్వం ఉద్యమకారు లను గుర్తిస్తుందని నిన్న మొన్నటి వరకు గర్వంగా చెప్పుకున్నారని కానీ కాలయాపన అయిన కొద్దీ ఉద్యమకారులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని కాలయాపన చేస్తే ప్రభుత్వానికి తీవ్ర నష్టం జరుగుతుందని అలా కాకుండా ప్రభుత్వం తొందరగా ఉద్యమకారు లను గుర్తించి ఉద్యమకారులు ఆశీస్సులతో మళ్ళీ అధికారంలోకి రావాలని క్రిస్టఫర్ డిమాండ్ చేశారు



# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మురళీ కార్తీక్

**కుటుంబాన్ని పరామర్శించిన కల్వకుంట్ల కవిత**

**కుషాయిగూడ, మహా :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీనియర్ నాయకుడు పబ్బోజు విజేందర్ కుమారుడు మురళీ కార్తీక్ కుటుంబాన్ని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. నాగారంలోని విజేందర్ నివాసానికి వెళ్లిన ఆమె, విజేందర్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మురళీ కార్తీక్ మృతిపై సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పబ్బోజు విజయేందర్ తెలంగాణ జాగృతి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా పనిచేశారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం అయినా పూర్ గ్రామ సర్పంచ్ గా ఎంపీటీసీగా పనిచేసే ప్రజాభిమానాన్ని చురగొన్నారు. కవిత వెంట పలువురు టిఆర్ఎస్ నాయకులున్నారు.

# నాగారం, ఎదులాబాద్ కాంగ్రెస్ కమిటీలు ప్రకటన

**కుషాయిగూడ, మహా :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాగారం, ఎదులాబాద్ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయి కమిటీలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ బుధవారం ప్రకటించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే లక్ష్యంతో నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని, పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, ఎదులాబాద్ డివిజన్ అధ్యక్షుడు సామల అమర్, నాగారం డివిజన్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, నాగారం మున్సిపాలిటీ మాజీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సాయిరాం నగర్ 2బీహెచ్‌కే ఇళ్ల సమస్యలు పరిష్కరించాలి

- లిఫ్ట్‌ల మరమ్మతులు, పైకప్పుల లీకేజీల నివారణకు చర్యలు తీసుకోవాలి
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా** : సాయిరాం నగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ ఎం. చైతన్యకుమార్‌ను కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించారు. ముఖ్యంగా పనిచేయని లిఫ్ట్‌లకు మరమ్మతులు చేపట్టాలని, అన్ని బ్లాక్‌లలో పైకప్పు స్లాబ్‌లపై ఫ్లోరింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. వర్షాకాలంలో పైకప్పుల నుంచి నీరు లీకేజీ కాకుండా అన్ని బ్లాక్‌లలో వాటర్‌ప్రూఫింగ్ పనులు చేపట్టాలని సూచించారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని, అవసరమైన పనులను త్వరితగతిన చేపట్టి నివాసితులకు మెరుగైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజినీర్‌ను ఎమ్మెల్యే కోరారు.





# ఉప్పల్‌లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి...

- గ్రేటర్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలవాలి
- రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు

**కుషాయిగూడ, మహా** : ఉప్పల్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు సూచించారు. బుధవారం తార్నాకలోని తన నివాసంలో ఉప్పల్ నియోజకవర్గ నేత కాటేపల్లి రవీందర్‌రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అత్యధిక కార్పొరేటర్ స్థానాలను కైవసం చేసుకుని, గ్రేటర్ హైదరాబాద్‌లో కాషాయ జెండా ఎగురవేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. వివిధ వర్గాల ప్రజలను పార్టీలోకి ఆహ్వానిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కాటేపల్లి రవీందర్‌రెడ్డికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రవీందర్‌రెడ్డితో పాటు నాచారం ప్రాంతానికి చెందిన బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల జాగ్రత్త ఎస్పీ

- పోలీస్ శిక్షణ అభ్యర్థులకు అవగాహన
- క్రమశిక్షణతో చదివి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్ష




**ఆదిలాబాద్ మహా**: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిజిటల్ అరెస్ట్, లోన్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్ పేరుతో జరిగే మోసాల పట్ల జాగ్రత్త వహించాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జాతీయ సైబర్ జాగృతి మాసోత్సవంలో భాగంగా బుధవారం ఆదిలాబాద్ జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఉచిత పోలీసు శిక్షణ పొందుతున్న అభ్యర్థులు ప్రాథమిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించేలా క్రమశిక్షణతో చదవాలని సూచించారు. నిరంతర కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని సాధించాలని అభ్యర్థులకు సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను వివిధ రకాలుగా మోసం చేస్తున్నారని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు, అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ, ఏటీఎం పిన్ వంటి వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని స్పష్టం చేశారు. అపరిచితులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని యాప్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దని సూచించారు. పోలీసులు, సీబీఐ, కస్టమ్స్ లేదా ఇతర ప్రభుత్వ అధికారులమని ఫోన్ చేసి కేసుల పేరుతో భయపెట్టి వీడియో కాల్స్ ద్వారా డబ్బులు డిమాండ్ చేసే మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరానికి గురైనప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే సైబర్ క్రైమ్ వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కానిస్టేబుల్, ఎస్సై ప్రాథమిక పరీక్షల్లో ప్రతి ఒక్కరూ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించేలా క్రమశిక్షణతో చదవాలని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, రోజువారీ చదువుతో పాటు పునశ్చరణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నిరంతర కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని సాధించాలని అభ్యర్థులకు సూచించారు. పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ సూచించారు. పోలీసు నియామకాలు పూర్తిగా నిబంధనల ప్రకారం, పారదర్శకంగా జరుగుతాయని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే పోలీసు యంత్రాంగానికి తెలియజేయాలని సూచించారు. ఇలాంటి నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్, రూరల్ ఎస్సై వి. విష్ణువర్ధన్, సైబర్ ఏఎస్ఐ సురేందర్, సిబ్బంది ఏసుదాస్, శివ, ఆహద్ తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

- లాభాల వాటా పెంపుపై పునరాలోచించాలి
- టీయూసీఐ రాష్ట్ర నేత మధుసూదన్‌రెడ్డి డిమాండ్

**మణుగూరు, మహా :** సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలను తక్షణమే పెంచడంతో పాటు లాభాల వాటా పెంపుపై ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం పునరాలోచించాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మణుగూరు ఏరియాలోని వివిధ కాంట్రాక్టు కార్మికుల పని ప్రదేశాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 2023లో కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన 18 రోజుల సమ్మె సందర్భంగా నెల రోజుల్లో వేతనాలు పెంచుతామని కార్మిక సంఘాల జేఏసీతో సింగరేణి యాజమాన్యం ఒప్పందం చేసుకుందని గుర్తుచేశారు. మూడేళ్లు గడుస్తున్నా ఆ హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచలేదని విమర్శించిన కాంగ్రెస్, అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీలను నమ్మి కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన కార్మికులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా వేతనాల పెంపుపై నిర్ణయం తీసుకోకపోవడం సరికాదన్నారు. కాంట్రాక్టు కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా వేతనాలను పెంచాలని, లాభాల వాటా పెంపు అంశాన్ని పునఃపరిశీలించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యం కొనసాగిస్తే భవిష్యత్తులో కార్మికుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మణుగూరు బ్రాంచ్ అధ్యక్షుడు వీ జానయ్య, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా ఇంటర్వ్యూలు కలెక్టర్

**ఆదిలాబాద్ మహా** : అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్ల నియమానికి సంబంధించిన ఇంటర్వ్యూ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ఇంద్రవెల్లి మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ నియమానికి దరఖాస్తు చేసుకున్న మహిళ అభ్యర్థులకు బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా, శిశు సంక్షేమానికి అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమని, వాటిని బలోపేతం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం టీచర్, హెల్పర్ నియామకాలను చేపట్టిందన్నారు. అర్హులైన ప్రతి అభ్యర్థికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నియామక ప్రక్రియను పకడ్బందీగా చేపట్టామన్నారు. ఇంద్రవెల్లి మండలంలో 9 టీచర్ పోస్టులకు అర్హత సాధించిన 56 మందిలో 48 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 8 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఎంపిక ప్రక్రియలో పూర్తిగా మెరిట్, నిబంధనలకే పెద్దపీట వేసినట్లు ఆయన పునరుద్ఘాటించారు.. ఈ ప్రక్రియలో ఉట్నూర్ సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిడబ్లుఓ మిల్కా, డిఎం హెచ్ వో డాక్టర్ సాధన, గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షణ అధికారి జగన్, సిడిపిఓలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# భవానీ మాలధారణ విద్యార్థులకు మద్దతుగా నిరసన

- నీలిమ మెడికల్ కళాశాల వద్ద బీజేపీ ఆందోళన

**కుషాయిగూడ, మహా** : అనురాగ్ యూనివర్సిటీ పరిధిలోని నీలిమ మెడికల్ కళాశాలలో భవానీ మాలధారణ చేసిన విద్యార్థులను పరీక్షలకు అనుమతించకుండా, మాల విరమించి కళాశాలకు రావాలని సందేశాలు పంపుతున్నారంటూ వచ్చిన ఆరోపణలపై బీజేపీ నాయకులు నిరసనకు దిగారు. విద్యార్థినులు గాజులు ధరించకూడదని ఒత్తిడి చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ నేత ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ, ఏబీవీపీ నాయకులు, భవానీ భక్తులు కళాశాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల మతపరమైన విశ్వాసాలు, ఆచారాలకు గౌరవం ఇవ్వాలని కళాశాల యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకుని కళాశాల యాజమాన్యంతో క్షమాపణ చెప్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆందోళనలో పలువురు బీజేపీ, ఏబీవీపీ నాయకులు, భవానీ భక్తులు పాల్గొన్నారు.

## మంచిర్యాలలో పేకాట స్థావరాలపై టాస్క్ ఫోర్స్ కొరడా

**3 రోజుల్లో 22 మంది అరెస్టు**

**మంచిర్యాల, మహా ప్రతినిధి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పేకాట రాయుళ్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత 15 రోజుల్లోనే వరుస దాడులతో పేకాట స్థావరాలను టార్గెట్ చేస్తున్నారు. తాజాగా బుధవారం మంచిర్యాల కాలేజ్ రోడ్డులోని హరిలయ విల్లాస్ వెనుక ప్రాంతంలో నలుగురు పేకాటరాయుళ్లను టాస్క్ ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మణ్ రావు బృందం అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 40,300 రూపాయల నగదు, 3 ఫోన్లు, స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. ఇదే కాకుండా కేవలం రెండు రోజుల క్రితం అక్టోబర్ 12న కూడా మంచిర్యాల జిల్లాలో రెండు చోట్ల భారీ దాడులు జరిగాయి. నస్పూర్ లో 8 మందిని, మంచిర్యాల ఎసిసి కాలనీలో 10 మందిని, మొత్తం 18 మందిని అరెస్ట్ చేశారు. వారి నుండి 56,140 రూపాయల నగదు, 11 బైకులు, 16 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అంటే కేవలం అక్టోబర్ 12 నుండి 14 మధ్యలోనే 22 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్, దాదాపు లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకుని పేకాట రాయులకు వెన్నులో వణుకు పుట్టిస్తున్నారు.



# విదేశీ బ్రాండ్ల కు రెక్కలు

- ఫుల్ బాటిల్ పై రూ.30 నుంచి 100 వరకు పెంపు
- 352 విదేశీ మద్యం బ్రాండ్ల ధరల్లో మార్పులు
- అక్టోబర్ 12 నుంచే కొత్త ధరలు అమల్లోకి

వరంగల్ బ్యూరో మహా ; తెలంగాణలో విదేశీ మద్యం ఫుల్ బాటిల్ ధరలకు రెక్కలు వచ్చాయి. బ్రాండ్ ను బట్టి ఫుల్ బాటిల్ పై రూ.30 నుంచి రూ.100 వరకు ధరలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సవరించిన ధరలతోనే విక్రయాలు జరపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది ఇప్పటికే విక్రయిస్తున్న 352 విదేశీ మద్యం బ్రాండ్ల ధరలను సమీక్షించిన ప్రభుత్వం, టెండర్ కమిటీ సమర్పించిన నివేదిక, సిఫారసుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 12 నుంచే కొత్త ధరలు అమల్లోకి వచ్చినట్లు అధికారిక సర్క్యులర్ జారీ అయింది. దీంతో విదేశీ మద్యం కొనుగోలుదారుల పై అదనపు భారం పడనుంది. రాష్ట్రంలో విక్రయిస్తున్న అన్ని విదేశీ మద్యం బ్రాండ్ల కు ఒకే విధంగా ధరలు పెంచకుండా, బ్రాండ్ ను బట్టి సవరణలు చేపట్టడం గమనార్హం. సగటున 6 శాతం మేర ధరలు పెరగడంతో వినియోగదారులు ఇక పై ఆయా బ్రాండ్ల ను కొనుగోలు చేసేందుకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అక్టోబర్ 12 నుంచి డిపోల ద్వారా సరఫరా చేసే ప్రతి స్టాక్ పై సవరించిన గరిష్ఠ చిల్లర ధరల స్టిక్కర్లు తప్పనిసరిగా వేయాలని తెలంగాణ రాష్ట్ర పానీయాల సంస్థ డిపో మేనేజర్ల ను ఆదేశించింది. వైన్స్, బార్ల యజమానులు కూడా కొత్త ధరల జాబితా ప్రకారమే విక్రయాలు జరపాలని స్పష్టం చేసింది. వినియోగదారులు మద్యం కొనుగోలు చేసే ముందు బాటిల్ పై ముద్రించిన తాజా గరిష్ఠ చిల్లర ధరను పరిశీలించాలని పాత ధరలతో విక్రయాలు జరగకుండా సవరించిన ధరల అమలు పై సంబంధిత అధికార యంత్రాంగం దృష్టి సారించింది.



# బతుకమ్మ ఘాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**ఆదిలాబాద్ మహా** : బతుకమ్మలను ప్రశాంతంగా భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేయాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ పిలుపునిచ్చారు. పండుగను పురస్కరించుకుని, బుధవారం పట్టణంలో బతుకమ్మ నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. ఖానాపూర్ ఘాట్, కుమ్మరివాడ , దుర్గానగర్ , బాలాజీనగర్ బతుకమ్మ ఘాట్‌లను పరిశీలించి, అక్కడ చేపడుతున్న ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ , సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బతుకమ్మ పండుగను మహిళలు, ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరుపుకునేలా మున్సిపాలిటీ తరఫున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బతుకమ్మ ఘాట్ల వద్ద తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని, నిమజ్జన ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా నిరంతరం శుభ్రపరిచే పనులు నిర్వహించాలని సూచించారు. అలాగే, బతుకమ్మ నిమజ్జనానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఘాట్ల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని, పారిశుధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు తెలిపారు.

# అన్నపూర్ణాదేవిగా కట్టమైసమ్మ

- దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- బుద్వేల్ టీచర్స్ కాలనీలో భక్తి సందడి
- ప్రత్యేక పూజలు, మహా అన్నప్రసాదంతో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పోతురాజు రామకృష్ణ జ్యోతి దంపతులు



**రాజేంద్రనగర్, మహా** :అమ్మవారి నామస్మరణతో మార్మోగుతున్న ఆలయం. భక్తుల రాకతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ప్రాంగణం.రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి పారవశ్యంతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అన్నపూర్ణాదేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పోతురాజు రామకృష్ణ జ్యోతి దంపతులు**

ఆలయ ప్రధాన అర్చకులు తాళ్లపాక సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో గండిపేట మండలం టియుడబ్ల్యూ (ఐజెయు) కార్యనిర్వహక కార్యదర్శి, ఏడబ్ల్యూఏ కమిటీ సభ్యులు,రాజేంద్రనగర్ నియోజకవర్గ రిపోర్టర్,పోతురాజు రామకృష్ణ జ్యోతి దంపతులు, శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యానవన వర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పోతురాజు యాదయ్య విజయలక్ష్మి దంపతులు,పందుల విజయలక్ష్మి కుటుంబ సభ్యులు,పాల్గొని అమ్మవారిని పూజించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రగడమ్‌పల్లి శ్రవణ్ కుమార్, టీచర్స్ కాలనీ అధ్యక్షుడు నందిగామ నరసింహ, శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు పెండ్యాల సాయి మాలిక్,బాలు ,టిచర్ సురేష్,రాజేందర్,కుమార్, రాజేందర్ పాండే,సాయి కుమార్,ఓగిరాల హరికృష్ణ, శివ భక్తులు పాల్గొన్నారు.

**భక్తులకు మహా అన్నప్రసాదం**

ప్రత్యేక పూజల అనంతరం పోతురాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.భక్తులకు అమ్మవారి దర్శనంతో పాటు అన్నప్రసాదం అందించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుతుండటం సంతోషంగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు కోరని శ్యామ్,కోరని నరేందర్ తెలిపారు. రానున్న రోజుల్లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# మానవత్వం చాటుకున్న పోలీసులు.. యువతిని బంధువులకు అప్పగింత

**ఓదెలలో రాత్రివేళ ఒంటరిగా తిరుగుతున్న యువతి గుర్తింపు.. క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగింత**

**పెద్దపల్లి మహా :** ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ పెద్దపల్లి జోన్ పోత్కపల్లి పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. మతిస్థిమితం సరిగా లేని ఓ యువతి రాత్రివేళ గ్రామంలో తిరుగుతుండగా గుర్తించి, ఆమె వివరాలు సేకరించి క్షేమంగా బంధువులకు అప్పగించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి ఓదెల గ్రామంలో నిన్న రాత్రి ఓ యువతి తిరుగుతున్నట్లు గ్రామ సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ పోత్కపల్లి ఎస్ఐ సనత్‌రెడ్డికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్ఐ సూచనల మేరకు బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ శివశంకర్ ఘటనాస్థలికి చేరుకున్నారు. యువతితో మాట్లాడి వివరాలు సేకరించగా, ఆమె వరంగల్‌కు చెందిన యువతిగా గుర్తించారు. అనంతరం ఆమె బంధువులను సంప్రదించి సమాచారం అందించారు. వారు ఘటనాస్థలికి చేరుకున్న తర్వాత యువతిని క్షేమంగా వారి వెంట పంపించారు. ఆపదలో ఉన్న యువతికి సాయం అందించి, కుటుంబ సభ్యుల చెంతకు చేర్చిన పోత్కపల్లి పోలీసుల సేవలను స్థానికులు అభినందించారు. విధి నిర్వహణతో పాటు మానవతా దృక్పథాన్ని చాటుకున్న పోలీసుల తీరుపై ప్రశంసలు వ్యక్తమయ్యాయి.





## ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, మహా: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెకు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించడంతోపాటు ఈహెచ్ఎస్, ఈఎస్ఐ, ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని కోరారు. డిమాండ్లు నెరవేరేవరకు పోరాటానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. సమావేశంలో ఆరేపల్లి రమేష్, తోగరి రాహుల్, సంబోజుల రాజేష్, నిఖిల్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై ఎంఎంసీ కొరడా

- మూడు జోన్లలో ప్రత్యేక డ్రైవ్
- రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు



**కుషాయిగూడ, మహా** : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాలు, రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్‌బీ నగర్ జోన్ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న అనధికార నిర్మాణాలు, ఆక్రమణలను తొలగించారు.

**మల్కాజిగిరి జోన్‌లో..**

బోయిన్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఫతేనగర్‌లో ఓ ప్రైవేటు భవనం వద్ద అనధికారంగా ఏర్పాటు చేసిన సెంటరింగ్‌ను తొలగించారు. ఫతేనగర్ నుంచి గౌతమ్‌నగర్ వరకు ఆక్రమణల తొలగింపు చేపట్టారు. యోగేంద్ర పార్థి ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన గదులను కూల్చివేశారు.

**ఉప్పల్ జోన్‌లో..**

ఘట్‌కేసర్ పరిధిలోని ఎస్‌వీ నగర్ నుంచి రాంపల్లి ఎక్స్ రోడ్డు, నాగారం డివిజన్ వరకు రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. కాచవాని సింగారంలో అక్రమంగా నిర్మించిన ఎనిమిది ర్యాంపులను తొలగించారు. ఉప్పల్ ఎక్స్ రోడ్డు నుంచి నాగోల్ వైపు, ఉప్పల్ భగాయత్ ఫేజ్ 2లోని డీమార్ట్ ప్రాంతం వరకు ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టి అనధికారంగా ఏర్పాటు చేసిన గుడిసెలను తొలగించారు. బోడుప్పల్ పరిధిలోని పీర్జాదిగూడ సర్కిల్ 10, శంకర్‌నగర్‌లో రహదారులను ఆక్రమించి నిర్మించిన ర్యాంపులను తొలగించారు.

**ఎల్‌బీ నగర్ జోన్‌లో..**

నాగోల్ పరిధిలోని బండ్లగూడ, నాగోల్ డివిజన్, అప్కో కాలనీలో అనధికారంగా నిర్మించిన పెంట్‌హౌస్, గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణాలపై చర్యలు చేపట్టారు. గ్రౌండ్‌ఫ్లోర్ గోడలు, రెండో అంతస్తుపై నిర్మించిన పిల్లర్లను తొలగించారు.

సరూర్‌నగర్ పరిధిలోని అష్టలక్ష్మి కమాన్ నుంచి డీవీఎం కళాశాల, సిరీస్ రోడ్డు వరకు ఆక్రమణల తొలగింపు డ్రైవ్ నిర్వహించారు. సుమారు 1.5 మీటర్ల మేర ఆక్రమణలను తొలగించి 15 ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. ఎల్‌బీ నగర్ పరిధిలోని కర్మన్‌ఘాట్ గ్రీన్‌పార్క్ కాలనీలోనూ ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టారు.

**తిరిగి ఆక్రమిస్తే చర్యలు**

ప్రజా రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించడం వల్ల పాదచారుల రాకపోకలకు, ట్రాఫిక్ నిర్వహణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని కమిషనర్ పేర్కొన్నారు. అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం, ప్రభుత్వ స్థలాలు, రహదారులను ఆక్రమించడాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఆక్రమణల తొలగింపు అనంతరం తిరిగి అవి ఏర్పడకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజా ఆస్తుల పరిరక్షణ, రహదారులపై సాఫీగా రాకపోకలు, పాదచారుల భద్రత, క్రమబద్ధమైన పట్టణాభివృద్ధి తమ ప్రధాన లక్ష్యాలని కమిషనర్ తెలిపారు. ప్రజలు మున్సిపల్ నిబంధనలు పాటిస్తూ ప్రజా స్థలాలను ఆక్రమించకుండా సహకరించాలని కోరారు.



# గోదావరిఖని కేకే నగర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

- 200 లీటర్ల గుడుంబా తయారీ ముడిసరుకు ధ్వంసం.. 50 ద్విచక్ర వాహనాల తనిఖీ
- మాదకద్రవ్యాలు, స్క్రాప్ దొంగతనాలపై ప్రత్యేక నిఘా
- టూ టౌన్ సీఐ ప్రసాద్‌రావు

**పెద్దపల్లి మహా**: గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి కేకే నగర్‌లో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టూ టౌన్ సీఐ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాంతంలోని ఇళ్లను, వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు.ఈ ప్రాంతంలో కొందరు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. గుడుంబా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు 50 ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. నంబర్ ప్లేట్లు, సరైన వాహన పత్రాలు, ఇన్సూరెన్స్ లేని వాహనాలకు జరిమానాలు విధించారు.

ఈ సందర్భంగా సీఐ ప్రసాద్‌రావు మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం, నిల్వ, సరఫరా, అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యకలాపాల్లో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రమేయం ఉన్నవారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.పారిశ్రామిక సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు సంబంధించిన స్క్రాప్ దొంగతనాలు, దొంగిలించిన స్క్రాప్‌ను కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం, విక్రయించడం వంటి నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా మహిళల భద్రత, సైబర్ మోసాల నివారణ, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధనలు, డయల్ 112 సేవలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు.నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని సీఐ వివరించారు. ప్రతి కాలనీ, నివాస ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో శాంతిభద్రతలను పరిరక్షించడం, పోలీసులకు ప్రజలకు మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.



# రామగుండం కమిషనరేట్ లో పోలీస్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీలు

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బుధవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా జైపూర్ పోలీస్ స్టేషన్‌ను, మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ హాజీపూర్ పోలీస్ స్టేషన్‌ను **తనిఖీలు చేశారు. జైపూర్ లో సీపీ తనిఖీ**: జైపూర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన సీపీ అంబర్ కిషోర్ ఝా, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ భూమేష్‌ను నేర నియంత్రణ చర్యలపై ఆరా తీశారు. సీసీటీఎన్ఎస్ లో కేసుల నమోదు, రికార్డుల అప్ లోడ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్ లో ఉన్న వ్యక్తుల ఇళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ నిఘా ఉంచాలని, 5 ఎస్ మేనేజ్మెంట్ విధానాన్ని అమలు చేసి స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతి సిబ్బందికి సీసీటీఎన్ఎస్ పై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. అంతేకాకుండా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా స్పందిస్తూ బ్లాక్ స్పాట్లను గుర్తించి హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా వాహనాలు నడపడంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జైపూర్ ఏసీపీ ఆర్ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

**హాజీపూర్ లో డీసీపీ తనిఖీ**

హాజీపూర్ స్టేషన్ లో డీసీపీ ఎ.భాస్కర్ తనిఖీ చేసి, స్వాధీనం చేసుకున్న వాహనాలను, రిసెప్షన్ సెంటర్ రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిపై ఎస్ఐ కిరణ్ కుమార్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని తెలిపారు. సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలని, మత్తు పదార్థాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ను సమర్థవంతంగా నిర్వహించాలని, స్టేషన్ కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- యువతను ఉద్యమంలోకి తీసుకొస్తా!
- ప్రజలకు మరింత చేరువయ్యేందుకు వెబ్‌సైట్‌తో పాటు టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి
- మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణిగుంట్ల ప్రవీణ్

**బెల్లంపల్లి, మహా**: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణిగుంట్ల ప్రవీణ్ పేర్కొన్నారు. ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బుధవారం నాడు ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింతగా చేరువయ్యేందుకు వెబ్‌సైట్‌తో పాటు టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి త్వరలోనే తీసుకువస్తానని, యువతను ఉద్యమంలోకి తీసుకొస్తా అని పునరుద్ఘాటించారు.మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణిగుంట్ల ప్రవీణ్ ప్రెస్‌మీట్ నిర్వహించి తన భవిష్యత్ కార్యాచరణను వెల్లడించారు. 2014 నుంచి మలి విడత తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని, అనంతరం మంచిర్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా విధులు నిర్వహించానని తెలిపారు.పదవీకాలం పూర్తైనప్పటికీ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, యువతను ఉద్యమాల్లోకి తీసుకొచ్చి సామాజిక చైతన్యం పెంపొందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అతి త్వరలో ఒక వెబ్‌సైట్‌ను ప్రారంభించి, ప్రజల నుంచి సమస్యలను స్వీకరిస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు వెబ్‌సైట్‌తో పాటు టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మిషన్ 2028 లో భాగంగా కేసీఆర్ ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం...రానున్న రోజుల్లో 'మిషన్ 2028'లో భాగంగా కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయాలనే లక్ష్యంతో పనిచేస్తామని రేణిగుంట్ల ప్రవీణ్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారని పేర్కొంటూ, ఆయన తిరిగి ముఖ్యమంత్రి అయ్యే దిశగా కృషి చేస్తామని వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీకి సోషల్ మీడియా కార్యకర్తలు, అభిమానులు గతంలో అందించిన మద్దతును భవిష్యత్తులోనూ కొనసాగించాలని కోరారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని వెల్లడించారు.



# రూ.1.75 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం..

- మణుగూరు పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం..
- మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యం..
- : ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, మహా** : మణుగూరు పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మణుగూరు సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలో జూనియర్ కళాశాల నుంచి రైల్వేగేటు వరకు రూ.1.75 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణుగూరు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధాన రహదారులపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో రాత్రివేళల్లో ప్రయాణికులకు, వాహనదారులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, వీధిదీపాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పినపాక నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా విభాగం అధ్యక్షురాలు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం

- సైబర్ మోసాలు, సోషల్ మీడియా పై అవగాహన తప్పనిసరి
- ఇన్స్పెక్టర్ ఏ. మహేందర్



హసన్ పర్తి మహా : వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ ఆదేశాల మేరకు అనంతసాగర్ గ్రామంలో సంఘమిత్ర అవగాహన కార్యక్రమం హసన్‌పర్తి

ఇన్స్పెక్టర్ ఎ. మహేందర్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంఘమిత్ర (కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్) ఉత్తర్వుల అమలులో భాగంగా, హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో మహిళా స్వయం సహాయక బృందాలతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ. మహేందర్ ముఖ్య అతిథిగా హాజరై, మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఎ. మహేందర్ మాట్లాడుతూ, సమాజంలో నేర రహిత, మాదకద్రవ్యాల రహిత వాతావరణాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సమావేశంలో ఇన్స్పెక్టర్ ప్రధానంగా క్రింది అంశాలపై మహిళలకు సుదీర్ఘంగా అవగాహన కల్పించారు.మాదకద్రవ్యాల నిర్మూలన యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు, మహిళా సంఘాలు నిరంతరం గమనిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

**కమ్యూనిటీ సీసీటీవీల ఏర్పాటు**

గ్రామంలో భద్రతను పెంపొందించేందుకు కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటును, వాటి వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

సైబర్ క్రైమ్, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు.

మహిళలు, బాలల రక్షణ

మహిళలు, పిల్లల రక్షణకు చట్టపరంగా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణలో మహిళలను భాగస్వామ్యులను చేస్తూ, గ్రామంలో జరిగే ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు లేదా క్రిమినల్స్ గురించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులతో పంచుకోవాలని ఆయన కోరారు. సమాచారమిచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ప్రతి పోలీస్ అధికారి క్షేత్రస్థాయిలో స్వయం సహాయక బృందాలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సురక్షితమైన సమాజ స్థాపనకు కృషి చేస్తున్నట్లు వివరించారు.ఈ కమ్యూనిటీ అవగాహన కార్యక్రమంలో హసన్ పర్తి పోలీస్ సిబ్బంది, మండల స్థాయి మహిళా సమైక్య ప్రతినిధులు, ఏపీఎం నారాయణ, సీసీ పద్మ, వీఏఓ రజిత, గ్రామ మహిళా సమైక్య సంఘ అధ్యక్షులు, కోశాధికారి, స్థానిక మహిళా సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలికల హక్కులు, రక్షణ పై అవగాహన తప్పనిసరి

- సోషల్ మీడియాలో అపరిచితులతో స్నేహం చేయవద్దు
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- మహిళల భద్రతకు షీ టీమ్స్ భరోసా



**హనుమకొండ, మహా** : వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా షీ టీమ్స్ ఆధ్వర్యంలో బాలికల భద్రత, మహిళా రక్షణ, వ్యక్తిగత అభివృద్ధి, సైబర్ నేరాలు, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు హనుమకొండ లోని బాలసముద్రం లోని కాళోజీ కళాక్షేత్రంలో షీ టీమ్స్ ఏసిపి సదయ్య నేతృత్వంలో బాలికా సంఘాలకు బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ, కౌమార దశలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా అధిగమిస్తూ జీవితంలో లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని బాలికలకు సూచించారు. ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకోవడంతో పాటు మానసిక, భావోద్వేగ సమతుల్యతను కాపాడుకోవాలని, అవసరమైనప్పుడు షీ టీమ్స్ సహాయం పొందాలని తెలిపారు. సైకాలజిస్ట్ డాక్టర్ బారుపాటి గోపి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరిలో ప్రత్యేకమైన సామర్థ్యాలు ఉంటాయని, వాటిని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మానసిక అడ్డంకులను అధిగమిస్తూ జీవిత లక్ష్యాల పై దృష్టిసారించాలని, సోషల్ మీడియాను విచక్షణతో వినియోగిస్తూ సైబర్ మోసాలు, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్.రాధిక మాట్లాడుతూ, కౌమార దశలో కలిగే శారీరక, మానసిక మార్పులపై బాలికలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా, సంకోచించకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా వైద్యుల సలహాలు తీసుకోవాలని తెలిపారు. బాలికల భద్రత, సాధికారత, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని, బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు సమస్యలను ధైర్యంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, అడిషనల్ డీసీపీలు బాలస్వామి, ఏసీపీలు సదయ్య, వెంకటరమణ, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, ఇన్‌స్పెక్టర్ ఓ.రమేష్, భరోసా సెంటర్ ఎస్ ఐ కిరణ్మయి, షీ టీమ్స్ ఆర్.ఎస్ఐ స్వాతి, ఎస్ఐ రామారావు తదితర పోలీస్ అధికారులు, వరంగల్ జిల్లాలోని తొమ్మిది మండలాలకు చెందిన బాలికలు, మెప్మా, స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# సంప్రదాయ అందంలో ఐషా శర్మ

సంప్రదాయ వస్త్రధారణలోనూ ఆధునిక ఫ్యాషన్‌ను జోడిస్తూ నటి, మోడల్ ఐషా శర్మ తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఎథ్నిక్ లుక్‌లో రాజసం ఉట్టిపడేలా కనిపిస్తూ ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. సంప్రదాయ దుస్తులకు తగిన ఆభరణాలు, చక్కటి స్టైలింగ్, సహజమైన అందంతో తన రూపాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకుంటున్నారు. సందర్భానికి తగిన దుస్తుల ఎంపికతో ఫ్యాషన్‌పై తనకున్న అభిరుచిని చాటుతున్నారు. ముఖ్యంగా భారతీయ సంప్రదాయాన్ని ప్రతిబింబించే వస్త్రధారణలో ఆధునిక హంగులను జోడించడం ఆమె స్టైల్‌లో ప్రత్యేకంగా కనిపిస్తోంది. సింపుల్‌గా కనిపించే దుస్తులకే సరైన ఆభరణాలు, హెయిర్‌స్టైల్, మేకప్‌తో కొత్త అందాన్ని తీసుకురావచ్చని ఆమె లుక్స్ తెలియజేస్తున్నాయి. ఐషా శర్మ కేవలం ఫ్యాషన్‌తోనే కాకుండా తన సినీ ప్రయాణంతోనూ ప్రేక్షకులకు పరిచయమయ్యారు. మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించిన ఆమె, ఆ తర్వాత హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. జాన్ అబ్రహాంతో కలిసి నటించిన 'సత్యమేవ జయతే' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. ప్రముఖ నటి నేహా శర్మకు చెల్లెలైన ఐషా, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. సినిమా అవకాశాలతో పాటు ఫ్యాషన్, ఫిట్‌నెస్ రంగాల్లోనూ ఆసక్తిని కొనసాగిస్తున్నారు. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఐషా శర్మ తన ఫొటోషూట్లు, వ్యక్తిగత శైలి, ఫిట్‌నెస్‌కు సంబంధించిన విశేషాలను అభిమానులతో పంచుకుంటుంటారు. ఆమె ఫొటోలు నెటిజన్లలో ఆసక్తిని పెంచుతుంటాయి. ముఖ్యంగా సంప్రదాయ దుస్తుల్లో కనిపించినప్పుడు ఆమె వస్త్రధారణ, ఆభరణాల ఎంపిక, మొత్తం లుక్‌పై ఫ్యాషన్ అభిమానులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పండుగలు, కుటుంబ వేడుకలు, ప్రత్యేక కార్యక్రమాలకు అనువైన ఎథ్నిక్ దుస్తులను ఎలా ఎంచుకోవాలనే విషయంలోనూ ఇలాంటి లుక్స్ యువతకు ప్రేరణగా నిలుస్తున్నాయి. ప్రస్తుత ఫ్యాషన్ ప్రపంచంలో పాశ్చాత్య దుస్తులతో పాటు భారతీయ సంప్రదాయ వస్త్రధారణకు కూడా మంచి ఆదరణ లభిస్తోంది. చీరలు, ఎంబ్రాయిడరీ దుస్తులు, సంప్రదాయ నగలు వంటి వాటిని ఆధునిక శైలిలో ధరించేందుకు యువత ఆసక్తి చూపుతోంది. ఈ నేపథ్యంలో ఐషా శర్మ ఎథ్నిక్ లుక్ సంప్రదాయానికి, ఆధునికతకు మధ్య అందమైన సమన్వయాన్ని చూపిస్తోంది. అందంగా కనిపించేందుకు ఖరీదైన దుస్తులే అవసరం లేదని, సరైన రంగుల ఎంపిక, దుస్తులకు తగిన ఆభరణాలు, ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రదర్శన కూడా ముఖ్యమని ఆమె స్టైలింగ్ తెలియజేస్తోంది. తన ప్రత్యేకమైన ఫ్యాషన్ ఎంపికలతో ఐషా శర్మ అభిమానులను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతున్నారు.





# ఇమాన్వికి ప్రభాస్ బర్త్‌డే ట్రీట్!

**హైదరాబాద్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తన మంచి మనసుతో మరోసారి అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నారు. తనతో కలిసి పనిచేసే సహనటీనటులను ఆప్యాయంగా చూసుకోవడంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన, తాజాగా 'ఫౌజీ' కథానాయిక ఇమాన్వి ఇస్మాయిల్‌కు పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక విందును పంపించి సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ విషయాన్ని ఇమాన్వి సోషల్ మీడియా వేదికగా పంచుకోవడంతో ఈ వార్త సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ప్రభాస్ పంపించిన రకరకాల వంటకాలను చూసి ఆనందం వ్యక్తం చేసిన ఆమె, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తన మనసుతో పాటు కడుపు కూడా నిండిపోయిందంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. దీంతో ప్రభాస్ ఆతిథ్యంపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రభాస్ తన సహనటీనటులు, సినిమా సిబ్బందికి రుచికరమైన భోజనాన్ని అందిస్తూ ఆప్యాయతను చాటుకుంటారనే పేరు ఉంది. షూటింగ్ సమయంలోనూ అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ, ప్రత్యేక సందర్భాలను మరింత ఆనందంగా మార్చేందుకు ప్రయత్నిస్తుంటారు. ఇప్పుడు ఇమాన్వి పుట్టినరోజు సందర్భంగా ఆయన పంపించిన విందు కూడా ఇదే విషయాన్ని మరోసారి గుర్తుచేసింది. బిర్యానీ, వివిధ రకాల మాంసాహార వంటకాలు, స్టార్టర్లు, స్వీట్లు సహా పలు రకాల పదార్థాలతో కూడిన విందు ఫొటోలను ఇమాన్వి అభిమానులతో పంచుకున్నారు. ఈ పోస్టు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీసింది. ఇక ఇమాన్వి విషయానికి వస్తే, సోషల్ మీడియాలో తన డ్యాన్స్ వీడియోల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న ఆమె ఇప్పుడు ప్రభాస్ సరసన నటించే అవకాశాన్ని అందుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' చిత్రంతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయం కానున్నారు. ఈ సినిమాలో ప్రభాస్‌తో ఆమె జోడీ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి ప్రేక్షకుల్లో ఇప్పటికే నెలకొంది. పీరియాడిక్ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. చిత్రీకరణ కొనసాగుతున్న నేపథ్యంలో సినిమా నుంచి వచ్చే ప్రతి కొత్త సమాచారం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇమాన్వి పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం కూడా ప్రత్యేక పోస్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపింది. మరోవైపు ప్రభాస్ ఇచ్చిన విందు ఆమెకు ఈ వేడుకను మరింత ప్రత్యేకంగా మార్చింది. తన సహనటుల పట్ల ఆప్యాయతను చూపించే ప్రభాస్ తీరు అభిమానులకు కొత్తేమీ కాకపోయినా, ఇలాంటి సందర్భాలు ఆయన వ్యక్తిత్వంపై మరోసారి చర్చకు కారణమవుతున్నాయి. 'ఫౌజీ' సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్న అభిమానులు, ప్రభాస్-ఇమాన్వి తెరపై ఎలా అలరిస్తారో చూడాలని ఆసక్తిగా ఉన్నారు.



# 'వారణాసి' గ్లోబల్ రికార్డు!

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' మరోసారి అంతర్జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచింది. ఈ సినిమా గ్లింప్స్ ఐమ్యాక్స్ అధికారిక యూట్యూబ్ ఛానల్‌లో విశేష స్పందనను సొంతం చేసుకుంది. హాలీవుడ్ చిత్రాల వ్యూస్ రికార్డులను అధిగమిస్తూ భారతీయ సినిమా సత్తాను చాటింది. ముఖ్యంగా జేమ్స్ కామెరూన్ దర్శకత్వంలో వచ్చిన 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' గ్లింప్స్‌కు లభించిన ఆదరణను దాటడం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. అంతర్జాతీయ ప్రేక్షకులు సైతం ఈ తెలుగు సినిమాపై దృష్టి సారించడం విశేషంగా మారింది.రాజమౌళి సినిమాలంటే భారీ విజువల్స్, అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు, కొత్త తరహా కథనం గుర్తుకొస్తాయి. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, ఇప్పుడు 'వారణాసి'తో మరో భారీ ప్రయత్నానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో సూపర్‌స్టార్ మహేశ్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తుండగా, ప్రియాంక చోప్రా జోనస్, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. విభిన్నమైన కథాంశం, అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న సాంకేతిక అంశాలు ఈ సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ఐమ్యాక్స్ అధికారిక యూట్యూబ్ ఛానల్‌లో 'వారణాసి' గ్లింప్స్ కోటి వ్యూస్ మార్కును దాటినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. గతంలో 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' వీడియో సుమారు 82.5 లక్షల వ్యూస్‌తో అగ్రస్థానంలో ఉండగా, 'వారణాసి' దాన్ని అధిగమించినట్లు సమాచారం. మార్వెల్ సంస్థకు



చెందిన 'డాక్టర్ స్ట్రేంజ్ ఇన్ ది మల్టీవర్స్ ఆఫ్ మ్యాడ్‌నెస్' వీడియో కూడా ఈ జాబితాలో ప్రముఖ స్థానంలో నిలిచింది. అయితే, ఈ గణాంకాలు ఐమ్యాక్స్ అధికారిక ఛానల్‌లోని వీడియోల వ్యూస్‌కు సంబంధించినవే తప్ప, మొత్తం యూట్యూబ్ వ్యూస్‌కు సంబంధించినవి కావు. ఈ చిత్రాన్ని భారీ తెరపై ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని అందించేలా రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే వెల్లడించింది. భారతీయ పురాణాల ప్రేరణతో పాటు సాహసభరితమైన అంశాలను మేళవించి కథను రూపొందిస్తున్నట్లు ప్రచార చిత్రాలు సూచిస్తున్నాయి. సినిమా విడుదలకు ముందే గ్లింప్స్ ఈ స్థాయిలో స్పందన పొందడం చిత్ర బృందానికి ఉత్సాహాన్నిచ్చే పరిణామంగా చెప్పవచ్చు. మహేశ్‌బాబు అభిమానులతో పాటు రాజమౌళి సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు తదుపరి అప్‌డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'వారణాసి' చిత్రంతో భారతీయ సినిమా అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత గుర్తింపు పొందుతుందా? ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే మరో విజయాన్ని రాజమౌళి అందిస్తారా? అన్న ప్రశ్నలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. గ్లింప్స్‌కు లభించిన స్పందన సినిమాపై అంచనాలను మరింత పెంచింది. అయితే, అసలు చిత్రం విడుదలైన తర్వాత ప్రేక్షకుల ఆదరణ, బాక్సాఫీస్ ఫలితాలే దాని విజయాన్ని నిర్ణయించనున్నాయి.

# కథ నచ్చి వెంటనే ఓకే చెప్పా!

**'హైందవ' చిత్ర బృందంపై సంయుక్త మీనన్ ప్రశంసలు**

**హైదరాబాద్:** కథలోని కొత్తదనం, దర్శకుడి ఆలోచనా విధానం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని నటి సంయుక్త మీనన్ తెలిపారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న 'హైందవ' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న ఆమె, సినిమా టీజర్ విడుదల కార్యక్రమంలో చిత్ర విశేషాలను పంచుకున్నారు. దర్శకుడు లూథీర్ బైరెడ్డి కథను వివరించిన తీరు తనకు బాగా నచ్చిందని, కథ విన్న వెంటనే ఈ ప్రాజెక్టులో నటించేందుకు అంగీకరించినట్లు చెప్పారు. సుమారు రెండు, మూడేళ్ల క్రితమే ఈ సినిమా కథ తన వద్దకు వచ్చిందని, కథను వివరించేందుకు దర్శకుడు సిద్ధం చేసుకున్న విజువల్స్, ప్రెజెంటేషన్ తనను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయని వెల్లడించారు. ముఖ్యంగా కథలోని అంశాలను కళ్లకు కట్టినట్లు వివరించడం వల్ల సినిమా పట్ల ఆసక్తి పెరిగిందని పేర్కొన్నారు. సినిమా చిత్రీకరణ సమయంలో ఎదురైన అనుభవాలను కూడా సంయుక్త గుర్తుచేసుకున్నారు. సినిమాటోగ్రాఫర్ హరీశ్ పనితీరును ప్రశంసిస్తూ, ప్రతి సన్నివేశం చిత్రీకరణ పూర్తయిన తర్వాత దాని అవుట్‌పుట్ చూడాలనే ఆసక్తి కలిగేదని తెలిపారు. సినిమాలోని దృశ్యాలు సహజంగా కనిపించేలా ఆంధ్రప్రదేశ్‌లోని పలు అందమైన ప్రదేశాల్లో చిత్రీకరణ జరిపినట్లు చెప్పారు. చిత్ర బృందం సాంకేతిక నైపుణ్యం, విజువల్స్ రూపకల్పన తనకు సంతృప్తినిచ్చాయని వివరించారు.హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నిర్మాత మహేశ్ చందు మధ్య ఉన్న స్నేహపూర్వక అనుబంధం సినిమా సెట్స్‌లో మంచి వాతావరణాన్ని ఏర్పరిచిందని సంయుక్త తెలిపారు. అందరూ కలిసి ఉత్సాహంగా పనిచేయడం వల్ల చిత్రీకరణ సంతోషంగా సాగిందన్నారు. టీజర్‌ను పూర్తిస్థాయి సంగీతం, విజువల్ ఎఫెక్ట్స్ తో చూసినప్పుడు మరింత అందంగా అనిపించిందని పేర్కొన్నారు. సినిమా ఫలితంపై తాను సంతృప్తిగా ఉన్నట్లు చెప్పారు. లూథీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'హైందవ'లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ప్రాచీన ఆలయం, అదృశ్యమైన విగ్రహాలు, వాటి వెనుక ఉన్న రహస్యాల చుట్టూ కథ సాగనున్నట్లు టీజర్ సూచిస్తోంది. మిస్టరీ, ఆధ్యాత్మికత, యాక్షన్ అంశాల కలయికతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శ్యామ్ సీఎస్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను మహేశ్ చందు నిర్మిస్తున్నారు. చిత్రాన్ని నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం నిర్ణయించింది. త్వరలో విడుదల కానున్న ట్రైలర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతుందని సంయుక్త మీనన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com